
ఈనాడు
డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ
శుక్రవారం అక్టోబరు 4, 2024

కల్పవల్లి.. నమోస్తుతే



ద్రాక్షారామ, న్యూస్‌టుడే: అష్టాదశ శక్తిపీఠాల్లో ఒకటైన కోనసీమ జిల్లాలోని ద్రాక్షారామ మాణిక్యాంబ అమ్మవారి ఆలయంలో దసరా ఉత్సవాలు ఆరంభమయ్యాయి. అమ్మవారు, మహిషాసుర మర్దినిదేవిగా గురువారం దర్శనమిచ్చింది. మంత్రి వాసంశెట్టి సుభాష్ హాజరై పట్టు వస్త్రాలు సమర్పించారు. వేగాయమ్మపేట జమీందారు వంశీయులైన వాడ్రేవు సుందర రత్నాకర రావు, ఆలయ ఈవో దుర్గాభవాని పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆలయ ప్రాంగణంలో నెలకొల్పిన దేవీ మండపంలో ఉదయం 6.35 గంటలకు కలశస్థాపన చేశారు. సాయంత్రం పంచమ పూజలు.. రాత్రి సువర్ణ, రజత, విశేష పుష్పాలతో అర్చనలు నిర్వహించారు.

అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పిస్తున్న మంత్రి సుభాష్

అన్నపూర్ణమ్మ.. అర్చింతుమమ్మా

మహాశక్తి యాగానికి 28 వేల మంది హాజరు



కాకినాడ శ్రీపీఠంలో మహాశక్తి యాగానికి ఏకరూప దుస్తుల్లో హాజరైన భక్తులు

సర్పవరం జంక్షన్: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గురువారం కాకినాడ రమణయ్యపేట శ్రీపీఠంలో ఐశ్వర్యాంబిక అమ్మవారు అన్నపూర్ణాదేవిగా దర్శనమిచ్చారు. గోశాల ప్రాంగణంలో 5 కోట్ల కుంకుమార్చనలు పూర్తి చేశారు. అమ్మవారి వైభవం గురించి పీఠాధిపతి స్వామి పరిపూర్ణానంద వివరించారు. మహాశక్తియాగం ప్రారంభించారు. తొలిరోజు 28 వేల మంది మహిళలు తరలివచ్చారు.

గుత్తేదారు బెట్టు.. లోగుట్టు

- నీటి పథకాల నిర్వహణకు టెండర్లు వేసి ఒప్పందాలు చేసుకోని వైనం
- ఆరు నెలలుగా పాత పద్ధతిలోనే బిల్లుల చెల్లింపు

న్యూస్‌టుడే, ముమ్మిడివరం

గ్రామీణ నీటి సరఫరా పథకం(ఆర్‌డబ్ల్యూఎస్)లోని ప్రాజెక్టుల నిర్వహణకు సంబంధించి విచిత్రమైన పరిస్థితి నెలకొంది. టెండర్లు దక్కించుకున్న గుత్తేదారులు ఒప్పందాలకు మాత్రం ముందుకు రావడం లేదు. తమకు లబ్ధి కలిగే విధంగా పైరవీలు చేసుకుంటూ కాలయాపన చేస్తున్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని ప్రాజెక్టుల వద్ద నీటి శుద్ధి, మోటార్ల నిర్వహణ, ప్రధాన పైపు లైన్ మరమ్మతులు, కార్మికులకు జీతాల చెల్లింపులు వంటి వాటికి ఏటా గుత్తేదారులను ఖరారు చేస్తుంటారు. మార్చితో ఒప్పంద గడువు ముగిసింది. ఎన్నికల కోడ్‌తో పాతవారినే కొనసాగించారు. జూన్‌లో కోడ్ ముగిసింది. 2024-25 సంవత్సరంలో మిగిలిన కాలానికి పథకాల నిర్వహణకు టెండర్ల ప్రక్రియలో తీవ్ర జాప్యం చేశారు.



ముమ్మిడివరంలోని రక్షిత తాగునీటి ప్రాజెక్టు

అందుకోసమేనా..

రూ.40 లక్షల కంటే ఎక్కువ నిర్వహణ వ్యయం ఉన్న పథకాలకు ఆగస్టులో టెండర్లు ఖరారు చేశారు. చాలామంది పాత గుత్తేదారులు 29 శాతం కంటే తక్కువకు వేసి పనులు దక్కించుకున్నారు. ఒప్పంద పత్రాలు రాసుకుని ఆ మేరకు నిర్వహణ, బిల్లుల చెల్లింపు ప్రక్రియ చేపట్టాల్సి ఉంది. పాత ఒప్పందాల ప్రకారం చూసుకుంటే బిల్లుల చెల్లింపులో మేలు జరుగుతుందంటూ కొత్త ప్రక్రియకు తాత్సారం చేస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. దీంతో ప్రభుత్వంపై ఆర్థిక భారం పడుతోంది.

వాటికి ఎప్పుడు మరి..

రూ.40 లక్షల కంటే తక్కువ వ్యయంతో నిర్వహించే పథకాలకు ఈఈ స్థాయిలో టెండర్లు పిలిచినా ఇంకా తెరవలేదు. ఈ ప్రాజెక్టుల్లోనూ ఇంకా పాత గుత్తేదారులే కొనసాగుతున్నారు. కార్మికులకు పీఎఫ్, ఇతర సౌకర్యాలు కల్పించాలని నిబంధనలు ఉన్నాయి. గుత్తేదారులు ఒప్పందాలకు ముందుకు రాకపోవడానికి ఇది కూడా ఓ కారణమని తెలుస్తోంది.

మచ్చుకు చూస్తే..

2023–24లో ముమ్మిడివరంలోని సమగ్ర రక్షిత తాగునీటి పథకం నిర్వహణకు టెండరు పిలిచారు. ఎస్ఎస్ఆర్ రేట్లకు 0.09 శాతం తక్కువకు గుత్తేదారు దక్కించుకున్నారు. ఇదే ప్రాజెక్టు నిర్వహణకు 2024-25కు సంబంధించి 29.27 శాతం తక్కువకు టెండరు వేసి దక్కించుకున్నారు. పాత టెండరు ప్రకారం నిర్వహణకు రూ.లక్ష చెల్లిస్తే.. కొత్తదాని ప్రకారం రూ.71 వేలు చెల్లించాలి.

సమగ్ర రక్షిత తాగునీటి పథకాలు: 64
గత ఏడాది నిర్వహణ వ్యయం రూ.35.19 కోట్లు
నిర్వహణ రూ.40 లక్షల కంటే ఎక్కువ ఉన్నవి 35
రూ.40 లక్షల కంటే తక్కువ ఉన్నవి 29

త్వరలో ఖరారు చేస్తాం..

నలభై లక్షల కంటే తక్కువ వ్యయంతో నిర్వహించే ప్రాజెక్టులకు సంబంధించి టెండర్ల ప్రక్రియ జరుగుతోందని, ఈనెల 15 నాటికి ఖరారు చేస్తామని కోనసీమ జిల్లా ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ కృష్ణారెడ్డి తెలిపారు. నిర్వహణ వ్యయం రూ.40 లక్షలకు పైబడిన వాటికి కాకినాడలోని ఎస్ఈ స్థాయిలో గుత్తేదారులు అగ్రిమెంట్లు రాయాల్సి ఉందన్నారు. ఇంకా ఒప్పందాలు జరగకపోవడంతో పాత టెండర్ల ప్రకారం చెల్లింపులు చేస్తున్నామన్నారు.

విదేశాలకు బియ్యం బళ్లు.. సిద్ధమేనా నిఘా కళ్లు

- తాజాగా పచ్చిబియ్యం ఎగుమతికి పచ్చజెండా
- రేషన్ సరకు తరలకుండా చర్యలు అవసరం

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: విదేశాలకు నౌకాశ్రయాల ద్వారా పచ్చిబియ్యం (రా రైస్) ఎగుమతికి కేంద్ర ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. గత కొన్నాళ్లుగా వీటిని నిలిపివేయగా ఇప్పుడు అనుమతి లభించిన నేపథ్యంలో ఎగుమతులతో కాకినాడ పోర్టు కళకళలాడనుంది. ఇప్పటికే ఇక్కడి నుంచి ఏటా లక్షల టన్నుల పచ్చిబియ్యం వెళ్తుంటాయి. వైకాపా ప్రభుత్వ హయాంలో వీటి మాటున పోర్టును అడ్డాగా చేసుకుని పేదల బియ్యం(పీడీఎస్)ను తరలించారన్న ఆరోపణలున్నాయి. కాకినాడ వైకాపాకు చెందిన ఓ మాజీ ప్రజాప్రతినిధి, ఆయన కుటుంబం, కొందరు ఎగుమతిదారులు దీనివెనుక ఉన్నారనే ఆరోపణలున్నాయి. కూటమి ప్రభుత్వం రాగానే మంత్రి నాదెండ్ల మనోహర్ పోర్టు పరిసరాల్లోని గోదాముల్లో తనిఖీలు చేశారు. పీడీఎస్ ఆనవాళ్లు ఉన్న 25వేల టన్నుల బియ్యం స్వాధీనం చేసుకున్నారు. రెండు చెక్‌పోస్టులూ ఏర్పాటుచేశారు. ఇప్పుడు పచ్చిబియ్యం ఎగుమతుల ముసుగులో రేషన్ సరకు తరలించకుండా గట్టి చర్యలు అవసరమన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

తనిఖీల్లో డొల్లతనం..

పోర్టు పరిసరాల్లోని రెండు చెక్‌పోస్టుల వద్ద ఒక్కో షిఫ్టులో ఒక్కో ఎస్సై, వీఆర్వో ఉన్నారు. ఆపై ఆర్డీవో, డీఎస్పీ, డీఎం, కాకినాడ తహసీల్దార్ పర్యవేక్షణ ఉంటుంది. గత రెండు నెలల్లో బియ్యం లోడుతో వెళ్లిన 26,559 వాహనాలు.. 39 గూడ్స్ రైళ్లకు చెందిన 1,198 వ్యాగన్ల సరకు పరిశీలించారు. బియ్యం నాణ్యత తనిఖీలు సక్రమంగా లేవనే ఆరోపణలున్నాయి. పోర్టు నుంచి ఇప్పటిదాకా బియ్యం, నూకలు ఎగుమతి అవుతున్నాయి. కొందరు రేషన్ బియ్యాన్ని నూకలుగా మార్చగా 12.50 లక్షల టన్నులు పట్టుకుని కేసులు పెట్టారు.



కాకినాడ పోర్టు సమీపంలో ఏర్పాటుచేసిన చెక్ పోస్టు వద్ద వాహనాన్ని తనిఖీ చేస్తున్న అధికారులు

మూలుగుతున్న అక్రమ నిల్వలు

వాస్తవంగా బియ్యం ఎగుమతులపై కేంద్రం నిషేధం విధించిన నేపథ్యంలో కొన్ని నెలలుగా కొందరు పెద్ద ఎత్తున అక్రమ నిల్వలు చేశారు. వీటిని ఇప్పుడు తరలించే అవకాశం ఉంది. పెద్ద ఎగుమతిదారుల్లో ఒకరిద్దరు కాకినాడలోనే ఉన్నారు.

ఏం చేయాలి

- కాకినాడకు దూరంగా పోర్టు ప్రాంతంలో ఈ చెక్‌పోస్టులు ఉన్నందున పోలీసు భద్రత అవసరం. సిబ్బంది సంఖ్యనూ పెంచాలి
- ఇతర ప్రాంతాల నుంచి కాకినాడకు వచ్చే బియ్యం లోడులను నిశితంగా తనిఖీ చేయాలి.
- పోర్టు చెక్‌పోస్టులే గాక కాకినాడకు జాతీయ రహదారుల మీదుగా వచ్చే ప్రాంతాల్లోనూ రెవెన్యూ, పోలీసు, పౌరసరఫరాలు, విజిలెన్స్-ఎన్‌ఫోర్స్‌మెంట్ శాఖలు డేగకళ్లతో పరిశీలన చేయాలి.



కాకినాడ పోర్టు నుంచి ఎగుమతి అయిన బియ్యం
■ లక్షల టన్నులు

మరింత అప్రమత్తం

చెక్‌పోస్టుల వద్ద నిఘాను ముమ్మరం చేస్తాం. అన్ని వాహనాలను తనిఖీ చేశాకే పోర్టులోకి అనుమతిస్తాం. గరిష్ఠంగా రోజుకు 1,199 వాహనాల్లో సరకు తరలించారు. కనిష్ఠంగా ఒక్క వాహనం వచ్చింది. తాజా పరిణామాలతో అవసరమైతే అదనపు సిబ్బందిని నియమిస్తాం. జిల్లాలోని ఇతర ప్రాంతాల్లోనూ రాత్రిపూట వాహనాలను ఆకస్మిక తనిఖీ చేస్తాం.

- ఎంవీ ప్రసాద్, జిల్లా పౌరసరఫరాల అధికారి, కాకినాడ

నిల్వలున్నా.. ఇసుక అందదే

రవాణా సమస్యలు అధిగమిస్తేనే మేలు

ఈనాడు, రాజమహేంద్రవరం: ఇసుక నిల్వలు తగినన్ని ఉన్నా ప్రజల అవసరాలు తీర్చలేని పరిస్థితి నెలకొంది. గోదావరిలో డీసిల్టింగ్ విధానం కింద 9 ప్రాంతాల్లో ఇసుక తవ్వేందుకు 44 బోట్స్‌మన్ సొసైటీలకు అనుమతించారు. రెండ్రోజులుగా కొన్ని రీచ్‌లలో తవ్వకాలు ప్రారంభించారు. ప్రస్తుతం ఈ విధానంతో నిత్యం సుమారు 4 వేల మెట్రిక్ టన్నుల ఇసుక బయటకు వస్తోంది. దీంతోపాటు నిడదవోలు మండల పరిధిలోని నిల్వ కేంద్రాల్లో సుమారు 50 వేల మెట్రిక్ టన్నుల ఇసుక ఉంది. మరిన్ని సొసైటీలకు సైతం తవ్వకాలకు అనుమతించేందుకు కసరత్తు జరుగుతోంది.



గాయత్రి రీచ్‌లో ఇసుక తవ్వకాలు (పాతచిత్రం)

ఇవీ ఇబ్బందులు

ఇసుక విక్రయాలకు సంబంధించి ఆన్‌లైన్ విధానం అమలవుతోంది. బుక్ చేసినవారికి కేటాయింపు ప్రక్రియ రాష్ట్ర స్థాయిలో జరుగుతోందని.. దీని వల్ల స్థానికంగా ఉన్న వాహనాలను దూర ప్రాంతాలకు కేటాయిస్తుంటే వారు ముందుకు రావడంలేదని అధికారులు చెబుతున్నారు. పెద్ద మొత్తంలో ఇసుక (బల్క్ బుకింగ్) కావాలనుకుంటే ఆన్‌లైన్ ప్రక్రియలో కొన్ని సాంకేతిక సమస్యలున్నాయని.. వాటిని అధిగమిస్తే ఇబ్బందులు ఉండవన్నారు.

నేడు 17 ప్రాంతాల్లో తవ్వకాలకు టెండర్లు?

తూర్పుగోదావరి జిల్లాలోని 17 ప్రాంతాల్లో ఓపెన్ రీచ్‌ల నిర్వహణకు (మాన్యువల్ విధానంలో) తవ్వకాలకు శుక్రవారం ఈ-టెండర్లు పిలవనున్నారు. సీతానగరంలో 3, పెరవలి-5, నిడదవోలు-3, కొవ్వూరు-4, తాళ్లపూడి-1, కడియంలో ఒక రీచ్‌లో అనుమతిస్తారు. వీటి ద్వారా సుమారు 7.90 లక్షల మెట్రిక్ టన్నుల ఇసుక అందుబాటులోకి వస్తుందని అంచనా వేస్తున్నారు. మరో రెండ్రోజుల్లో ధవళేశ్వరం బ్యారేజీకి ఎగువన 8 ప్రాంతాల్లోనూ టెండర్లు పిలిచే యోచనలో అధికారులున్నట్లు తెలుస్తోంది.

టెట్‌కు తొలిరోజు 199 మంది హాజరు



పత్రాలను పరిశీలిస్తున్న కళాశాల సిబ్బంది

అమలాపురం గ్రామీణం, న్యూస్‌టుడే: భట్లపాలెం బీవీసీ ఇంజినీరింగ్ కళాశాలలో టీచర్ ఎలిజిబులిటీ టెస్ట్ (టెట్) గురువారం ప్రారంభమైంది. ఉదయం 115 మందికి 99 మాత్రమే హాజరయ్యారు. మధ్యాహ్నం పూట 115 మందికి 100 పరీక్ష రాశారు. ఈనెల 10 వరకు ఈ పరీక్షలు జరగనున్నాయి.

తితిదే దర్శనాల పేరుతో మోసం

పాలకొల్లు మార్కెట్: రాజకీయ నాయకుల పేర్లతో తితిదే దర్శనం టికెట్లు ఇప్పిస్తామని, స్థల వివాదాలు తీరుస్తామని మోసం చేస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేశారు. పాలకొల్లు పట్టణ సీఐ కె.రజనీకుమార్ కథనం ప్రకారం.. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా సఖినేటిపల్లి మండలం గుడిమూలకు చెందిన గునిశెట్టి రాజ్‌కుమార్, వైట్ల సురేష్‌లు గత కొంత కాలంగా మంత్రులు, ఇతర రాజకీయ నాయకుల పేర్లు చెప్పి తితిదే వస్త్రాలంకరణ సేవ టికెట్లు ఇప్పిస్తామని కొందరిని నమ్మించారు. ఈ ఏడాది జులైలో పాలకొల్లుకు చెందిన అయిదు కుటుంబాల వద్ద రూ.లక్ష తీసుకున్నారు. గతనెల 25న పోడూరు మండలం కవిటం గ్రామానికి చెందిన మేడపాటి రామచంద్రరెడ్డి స్థలం విషయంలోను రాజీ కుదురుస్తామని రూ.10 లక్షలు తీసుకుని పరారయ్యారు. బుధవారం రాత్రి ఇద్దరినీ పాలకొల్లు బస్టాండ్ ప్రాంతంలో గుర్తించి అరెస్టు చేసినట్లు తెలిపారు. నిందితులను గురువారం పాలకొల్లు కోర్టులో హాజరు పరిచగా 14 రోజులు రిమాండ్ విధించినట్లు సీఐ తెలిపారు.

చట్ట సవరణ అమలుపై నిరసన

రామచంద్రపురం: న్యాయవాదుల చట్ట సరవణకు వ్యతిరేకంగా రామచంద్రపురం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం పలువురు న్యాయవాదులు నిరసన వ్యక్తం చేశారు. బార్ అసోసియేషన్ భవనం ఎదుట పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. క్రమశిక్షణ కమిటీలో వృత్తితో సంబంధం లేని వ్యక్తులను చేర్చే విధంగా చట్టం ఉందన్నారు బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వాడ్రేవు సాయిప్రసాద్, ఉపాధ్యక్షుడు పలివెల సత్యనారాయణ, న్యాయవాదులు పాల్గొన్నారు.



బార్ అసోసియేషన్ భవనం వద్ద న్యాయవాదుల ధర్నా

అలజడి.. రక్షణ కొరవడి

భారీగా కోతకు గురవుతున్న తీరం

న్యూస్‌టుడే, అమలాపురం కలెక్టరేట్, అంతర్వేది

- అల్లవరం మండలం ఓడలరేవు గ్రామంలో సముద్రం విశ్వరూపం చూపుతోంది. గత ఏడాది కాలంలోనే 500 మీటర్లు ముందుకు చొచ్చుకు వచ్చింది. సరుగుడు తోటలు, ఓఎన్జీసీ రహదారి సముద్రం గర్భంలో కలిసి పోయాయి.
- సఖినేటిపల్లి మండలం అంతర్వేది తీరంలో గత అయిదేళ్లలో సముద్రం 300 మీటర్లు ముందుకు వచ్చి తీరం భారీగా కోతకు గురైంది. సీసీ రహదారి, ప్రైవేటు భవనం సముద్ర గర్భంలో కలిసి పోయాయి. వందల ఎకరాల భూములు కనుమరుగయ్యాయి.



విశాఖపట్నంలో ఏర్పాటు చేసిన రక్షణ గట్టు

మడ అడవులు ఏవీ..?

ఆటుపోట్లతో సంబంధం లేకుండా సముద్రపు అలలు తీరంపై విరుచుకుపడుతున్నాయి. కొన్నేళ్లుగా వందల ఎకరాలు సముద్ర గర్భంలో కలిసి పోయినట్లు సెంట్రల్ బోర్డ్ ఆఫ్ జియో ఫిజిక్స్ విభాగం నిర్వహించిన అధ్యయనంలో గుర్తించారు. ఒక్కప్పుడు సముద్ర తీరం అనగానే సరుగుడు వనాలు, తాడిచెట్లు, మొగలిపొదలు, మడ చెట్లు కనువిందు చేసేవి. కొన్నాళ్లుగా ఇష్టానుసారంగా వాటిని నరికి వేయడంలో సముద్రపు గాలులను నిలువరించే అవకాశం లేక పోతోంది. అలలు ఉవ్వెత్తున ఎగిసి పడుతున్నాయి. అధికారుల లెక్కల ప్రకారం జిల్లాలో 23,750 ఎకరాల్లో మడ అడవులు ఉండాలి. క్షేత్ర స్థాయిలో సగం వరకు కనుమరుగయ్యాయి. సముద్రపు అలలు వేగంగా తీరానికి వచ్చే సమయంలో నీరు తీరం వెంబడి ఉండే చిత్తడి నేలల్లోకి ప్రవేశించి తీర ప్రాంతాలను కోత నుంచి రక్షిసుంది. కొంత కాలంగా వీటిల్లో అనధికారిక చెరువులు తవ్వేశారు.

నిబంధనలు తుంగలో తొక్కి..

తీరానికి 500 మీటర్ల దూరంలో నిర్మాణాలు చేపట్టకూడదన్న నిబంధనలు తుంగలో తొక్కేశారు. అనధికారికంగా రొయ్యల చెరువుల సాగు, ఇతర చర్యలు భద్రతను ప్రశ్నార్థకంగా మార్చేశాయి. అలల తాకిడిని తగ్గించి తీరం కోతను అరికట్టే మడ అడవులు, సరుగుడు, మొగలి పొదలు దాదాపు కనుమరుగయ్యాయి. సముద్రం సుమారు కిలోమీటరు మేర ముందుకు చొచ్చుకు వచ్చి తీరం కోతకు గురవుతోంది.

సముద్రతీర మండలాలు	9
తీరరేఖ పొడవు	93 కిలోమీటర్లు
తీరం సమీప గ్రామాలు	146
తీరప్రాంత జనాభా	4 లక్షలు



ఓడలరేవు సముద్ర తీరంలో కోతకు గురవుతున్న తీరం

పట్టాలెక్కని ప్రతిపాదనలు

జిల్లాలో సముద్ర తీర గ్రామాల్లో కోతకు గురవుతున్న ప్రాంతాల్లో విశాఖపట్నంలో మాదిరిగా సిమెంటు కాంక్రీట్‌తో వేసిన దిమ్మెలను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. దీనికి గత ప్రభుత్వంలో ప్రతిపాదనలు చేశారు. ఇందులో చమురు సంస్థలను భాగస్వాములను చేసి మిగిలిన సొమ్ము కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమకూర్చేలా రూ.1,250 కోట్లతో అంచనాలు రూపొందించారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి సానుకూలత లేకపోవడంతో ఆ పనులు పట్టాలెక్కలేదు.

పవన్ ప్రసంగం తెరపై వీక్షణ

తిరుపతిలో ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ గురువారం నిర్వహించిన వారాహి బహిరంగ సభ ప్రత్యక్ష ప్రసారాన్ని రాజోలులో భారీ తెరపై ప్రదర్శించారు. ఆయన ప్రసంగం ప్రారంభం కాగానే జనసైనికులు తెరపై పూలుజల్లి కేరింతలు కొట్టారు. మాజీ ఎమ్మెల్యే మానేపల్లి అయ్యాజీవేమా, సూరిశెట్టి శ్రీనివాస్, నామన షణ్ముఖ్, కోళ్ల బాబి, సాదనాల వెంకన్నబాబు, రేకపల్లి శ్రీను, కూటమి నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని పవన్ ప్రసంగాన్ని వీక్షించారు.



- న్యూస్‌టుడే, రాజోలు

సీఎం హామీలకు పరిష్కార మార్గాలు చూపాలి

అమలాపురం కలెక్టరేట్: ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆగస్టు 23న వానపల్లి గ్రామంలో నిర్వహించిన సభలో స్వీకరించిన అర్జీలకు తక్షణం పరిష్కార మార్గాలు చూపాలని జేసీ నిశాంతి అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రజల నుంచి సీఎం స్వీకరించిన అర్జీలపై పురోగతిని ముఖ్యమంత్రి కార్యాలయానికి పంపవలసి ఉంటుందన్నారు. ఈ నేపథ్యంలో అధికారులు త్వరితగతిన సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలన్నారు. సీఎం ఇచ్చిన హామీలను అధికారులను సమన్వయం చేసుకుంటూ పూర్తి చేయాలన్నారు. సమావేశంలో డీఆర్వో వెంకటేశ్వర్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

కాలువల ఆక్రమణలు, పూడిక తొలగిస్తాం

న్యూస్‌టుడే, పి.గన్నవరం

‘న్యూస్‌టుడే’తో జలవనరుల శాఖ డీఈఈ నాగేంద్రకుమార్



ముఖాముఖి

గోదావరి మధ్య డెల్టాలో పి.గన్నవరం సబ్‌డివిజన్ పరిధి ఎక్కువ. గత అయిదేళ్ల కాలంలో వైకాపా ప్రభుత్వం సాగునీటిపారుదల వ్యవస్థను నిర్వీర్యం చేసింది. ఫలితంగా రెండోపంట రబీ సమయంలో శివారు ఆయకట్టుకు సాగునీటి కోసం రైతులు నానా అవస్థలు పడాల్సి వస్తోంది. మరోవైపు పంట కాలువలు ఏళ్లతరబడి ఆక్రమణలకు గురయ్యాయి. ఆత్రేయపురం మొదలుకుని సఖినేటిపల్లి వరకు తొమ్మిది మండలాల పరిధిలో సాగునీటి కట్టడాలు, పంటకాలువలు విస్తరించి ఉన్న ఈ సబ్‌డివిజన్‌లో 83,378 ఎకరాల వరి పంట ఆయకట్టు ఉంది. పి.గన్నవరం సబ్‌డివిజన్ డీఈఈగా ఆర్.నాగేంద్రకుమార్ నూతనంగా ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయా మండలాల పరిధిలోని కాలువల పరిస్థితి, రైతుల ఇబ్బందులు, కొత్త ప్రాజెక్టుల నిర్మాణం, నిధుల మంజూరు, కొత్తగా ప్రతిపాదనలు తదితరాలపై ఇలా వివరించారు.

- శిథిలావస్థకు చేరుకున్న లొల్ల హెడ్‌లాకుల స్థానే నూతన కట్టడాలు నిర్మించాల్సిన అవసరం ఉంది. వీటిద్వారా కోనసీమలో సుమారు 1.70 లక్షల ఎకరాలకు సాగునీరు సరఫరా అవుతుంది. కొత్త కట్టడాలు నిర్మించేందుకు రూ.70 కోట్లతో ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపాం.
- వచ్చే వేసవి శివారు నాటికి కాలువల్లో పూడికతీత పనులు చేసేందుకు ప్రాధాన్యత ఇస్తాం. దీనికి సంబంధించి ప్రతిపాదనలు తయారు చేస్తున్నాం.
- రాజోలు దీవికి ఎంతో ప్రాధాన్యత కలిగిన పి.గన్నవరం డొక్కా సీతమ్మ అక్విడక్టు రహదారి, విద్యుత్తు మరమ్మతు పనులకు రూ.88.50 లక్షలతో ప్రతిపాదనలు తయారు చేసి కలెక్టర్‌కు పంపాం.
- సబ్‌డివిజన్ పరిధిలో కాలువలపై సుమారు 1,700 ఆక్రమణలు గుర్తించాం. ఆత్రేయపురం, రావులపాలెం, కొత్తపేట, అంబాజీపేట, పి.గన్నవరం, మామిడికుదురు, రాజోలు, మలికిపురం, సఖినేటిపల్లి. . ఇలా తొమ్మిది మండలాల్లో ఆక్రమణలు గుర్తించి రెవెన్యూ అధికారులకు పంపాం. వీటిని తొలగించేందుకు సంయుక్తంగా చర్యలు తీసుకుంటాం.
- ఓఅండ్ఎం నిధులు రూ.1.31 కోట్లతో 34 నిర్వహణ పనులు చేసేందుకు నిధులు మంజూరు కావడంతో పనులు మొదలుపెట్టాం. ఖరీఫ్ మొదలుకుని రబీ వరకు ఈ నిధులతో తూడు తొలగింపు పనులకు ప్రాధాన్యత ఇస్తున్నాం.
- పంటకాలువల్లో చాలామంది చెత్తాచెదారం వేస్తున్నారు. ఇది సరైన పద్ధతికాదు. ఈ కారణంగా కాలువలు అధ్వానంగా మారుతున్నాయి. ప్రజలు ఆలోచించి సహకరించాలి.

రహదారి గుంతే ప్రాణం తీసింది..

చికిత్స పొందుతూ ప్రధానోపాధ్యాయురాలి మృతి



సీహెచ్ సుజాత (పాత చిత్రం)

అంతర్వేది, న్యూస్‌టుడే: రహదారి గుంతలో పడి మరో నిండుప్రాణం బలైపోయింది. ఈ నెల 1న జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కేశవదాసుపాలెం జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సీహెచ్ సుజాత(55) గురువారం మృతిచెందారు. పాఠశాలకు ద్విచక్రవాహనంపై వెళ్తూ అంతర్వేది- శృంగవరప్పాడు రహదారిపై కేశవదాసుపాలెం వద్ద పెద్ద గుంతలో పడి ప్రమాదానికి గురయ్యారు. తీవ్రంగా గాయపడిన ఆమెను వెంటనే కాకినాడలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందడంతో స్వగ్రామం అంతర్వేదిపాలెం, కేశవదాసుపాలెం ఉన్నత పాఠశాలల్లో విషాదఛాయలు అలముకున్నాయి. 2011 నుంచి ఆమె గెజిటెడ్ హెచ్ఎంగా సేవలందిస్తున్నారు. భర్త, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఎంఈవో డి.కిశోర్‌కుమార్, ఉపాధ్యాయులు సంతాపం వ్యక్తం చేశారు.



అంతర్వేది-శృంగవరప్పాడు మార్గంలో ప్రమాదం జరిగిన ప్రాంతం

అవయవ దానంతో సజీవం..

ప్రధానోపాధ్యాయురాలు సుజాత గతంలోనే తన మరణానంతరం అవయవాలను దానం చేసేందుకు నిర్ణయించుకున్నారు. ఈ మేరకు ‘ఆంధ్రప్రదేశ్ జీవన్‌దాన్’ సంస్థకు అప్పగించారు. కళ్లు, గుండె, తదితర అవయవాలను ఏపీ జీవన్‌దాన్ సంస్థ తీసుకుని భౌతికకాయాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

అధికారుల నిర్లక్ష్యంతోనే..

గత వైకాపా ప్రభుత్వం శృంగవరప్పాడు నుంచి అంతర్వేది ఆలయం వరకు రెండు వరుసల రహదారి అభివృద్ధికి రూ.25 కోట్లు మంజూరు చేసింది. అంతర్వేదిలో కొంతమేర సీసీరోడ్డుగా అభివృద్ధి చేయగా మిగిలిన ప్రాంతంలో బీటీగా అభివృద్ధి చేశారు. ప్రభుత్వం నిధులు సక్రమంగా విడుదల చేయకపోవడంతో గుత్తేదారు పనులు నిలిపివేశారు. ఈ క్రమంలోనే రహదారిపై గుంత ఏర్పడింది. దీన్ని సరిచేయడంలో నిర్లక్ష్యం చేయడంతో ప్రధానోపాధ్యాయురాలు బలైపోయారు.

దేవీ నమామి.. సదా స్మరామి..


స్వర్ణకవచాలంకృత దుర్గగా అమలాపురం శ్రీదేవి మాత


ఆత్రేయపురం: పూర్ణాలంకారంలో వాడపల్లి ఆండాళ్ దేవి


అమలాపురం: హౌసింగ్‌బోర్డు కాలనీలో కల్యాణదుర్గ

అమ్మలగన్నయమ్మ పూజా వేడుకలు అట్టహాసంగా మొదలయ్యాయి.. ముగ్గురమ్మల మూలపుటమ్మ నవరాత్రులు వైభవంగా జరుగుతున్నాయి. ఈ దసరా శరన్నవరాత్రుల్లో నవదుర్గల అలంకారంలో రోజుకో రూపంతో ఆ పరాశక్తి దర్శనమివ్వనుంది.. అందులో భాగంగా తొలిరోజైన గురువారం ఊరికో అలంకారంతో కనువిందు చేసింది.. నవరాత్రుల దీక్షధారుల జయధ్వానాల నడుమ విశేష పూజలందుకుంది.. కోనసీమ జిల్లాలోని కొన్ని ప్రముఖ ఆలయాల్లో ఆ శక్తి స్వరూపిణి కనువిందు చేసే చిత్రాలివి..

- న్యూస్‌టుడే, కోనసీమ


మండపేట గ్రామీణ: బాలా త్రిపురసుందరిగా కన్యకాపరమేశ్వరి


రామచంద్రపురం: పార్కు వద్ద కనకదుర్గ అమ్మవారికి విశేషాలంకారం


మలికిపురం: గుడిమెళ్లంకలో...

అన్నవరంలో రామబాణానికి పూజలు

అన్నవరం, న్యూస్‌టుడే: శ్రీరాముడు 14 ఏళ్ల వనవాసానికి గుర్తుగా బంగారం, వెండితో అయోధ్య భాగ్యనగర్ సీతారామ సేవా ఫౌండేషన్ తయారు చేయించిన రామబాణానికి అన్నవరంలో గురువారం ప్రత్యేక పూజలు చేశారు. అయోధ్య రామమందిరానికి అందజేసేందుకు ఒక కిలో బంగారం, 13 కిలోల వెండితో మొత్తంగా 14 కిలోగ్రాముల బాణాన్ని చేయించారు. రామభక్తుల దర్శనానికి బాణాన్ని అన్ని పుణ్యక్షేత్రాలకు తీసుకెళ్తున్నారు. ఫౌండేషన్ స్థాపకులు చల్లా శ్రీనివాస శాస్త్రి ఆధ్వర్యంలో అన్నవరం తెచ్చారు. ముందుగా అర్చకులు పూజలు చేసి సత్యదేవుని ప్రధానాలయం వద్దకు తీసుకెళ్లారు. అక్కడ పూజల అనంతరం క్షేత్ర పాలకులు సీతారాముల వారి ఆలయంలో ఉంచి పూజలు చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు రామబాణాన్ని దర్శించుకున్నారు.


పూజలు చేస్తున్న వైదిక బృందం

వాడపల్లి వెంకన్న హుండీ ఆదాయం రూ.1.11 కోట్లు

ఆత్రేయపురం, న్యూస్‌టుడే: కోనసీమ తిరుమల వాడపల్లి వేంకటేశ్వర స్వామి హుండీ కానుకలు ఆలయ వసంత మండపంలో దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారుల పర్యవేక్షణలో గురువారం లెక్కించారు. 35 రోజులకు గాను రూ.1,08,89,635 క్షేత్రపాలకుడు విశ్వేశ్వరస్వామి హుండీ ద్వారా రూ.2,36,510తో కలిపి మొత్తం రూ.1,11,26,145 ఆదాయం సమకూరింది. దీంతో పాటు 19 గ్రాముల బంగారం, 735 గ్రాముల వెండి, పలు విదేశాల కరెన్సీ వచ్చిందని దేవస్థానం డిప్యూటీ కమిషనర్ నల్లం చక్రధరరావు తెలిపారు. దేవస్థానం పాలకమండలి మాజీ ఛైర్మన్ కరుటూరి నరసింహారావు, దేవాదాయ శాఖ తనిఖీదారుడు టీవీఎస్ ప్రసాద్, ఈవోలు ఎన్‌వీఎన్‌ఎస్‌వి ప్రసాద్ రాజు, రావులపాలెం కెనరా బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ ఇండియా సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


కానుకలు లెక్కిస్తున్న సిబ్బంది, సేవకులు

భలే బొమ్మలు.. భళా చెల్లెమ్మలు..!

కొబ్బరి పీచుతో ఆకట్టుకునే ఆకృతులు

న్యూస్‌టుడే, మామిడికుదురు

కోనసీమ పేరు చెప్పగానే 1,36,347 ఎకరాల్లో పచ్చదనంతో విస్తరించిన కొబ్బరి సోయగాలు కనిపిస్తాయి. అడుగడుగునా పరచుకున్న హరిత సిరుల ఆనవాళ్లు దర్శనమిస్తాయి. ఇక్కడ ఎకరాకు సగటున 7,908 కాయల దిగుబడి వస్తోంది. కొబ్బరి కాయల డొక్క నుంచి లభించే పీచును పలు ఉత్పత్తులకు తరలించడంతో పాటు స్థానికంగానూ తాళ్లు, గోదినీలు తయారు చేసి విక్రయిస్తుంటారు. పీచుతో కళాత్మకంగా బొమ్మలు చేయడంలో పలువురు మహిళలు ఆసక్తి చూపుతు న్నారు. స్వయం ఉపాధిగా వీటిని మలచుకునేందుకు గతంలో కాయిర్ బోర్డు, నాబార్డు ద్వారా పలు గ్రామాల్లో శిక్షణ ఇచ్చారు. బొమ్మలను తయారు చేయడంలో నాణ్యతే ప్రధానాంశం కావడంతో ఇందులో నిష్ణాతులైన వారితో శిక్షణ ఇచ్చే దిశగా ఓఎన్జీసీ సీఎస్ఆర్ సహకారంతో కార్యాచరణ కొనసాగుతోంది.


శిక్షణ పొందుతున్న మహిళలు



అందమైన బొమ్మలు

ఒడిశా శిక్షకులు.. నాణ్యమైన బొమ్మలు

కోనసీమలోని అమలాపురం గ్రామీణం సహా రాజోలు, పి.గన్నవరం నియోజకవర్గాల్లోని దాదాపు 12 గ్రామాల్లో గతంలో 350 మంది మహిళలకు పీచుతో పలు రకాల కళాత్మకమైన బొమ్మలను రూపొందించడంలో శిక్షణ ఇచ్చారు. డీఆర్‌డీఏ, లేపాక్షి తదితర వాటి ద్వారా వీటికి ఇతర ప్రాంతాల్లో మార్కెటింగ్ సౌకర్యాలు మెరుగుపడేలా దృష్టి పెట్టారు. ఇందులో భాగంగా ఓఎన్జీసీ సీఎస్ఆర్, ఆక్సిజన్ అసోసియేషన్ స్వచ్ఛందంగా పాశర్లపూడి బాడవలో కార్యాచరణ చేపట్టాయి. దాదాపు నెల రోజుల నుంచి తొలి దఫాగా 30 మంది మహిళలకు శిక్షణ ఇస్తున్నారు. నాణ్యంగా, ఎంతో కళాత్మకంగా పీచు బొమ్మలను తయారు చేసేందుకు ఒడిశా నుంచి ఇద్దరు శిక్షకులను తీసుకొచ్చి తర్ఫీదునిస్తున్నారు. డీఆర్‌డీఏ పీడీ, పరిశ్రమల శాఖ జీఎం సహా కార్మిక సంక్షేమశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ఈ బొమ్మలను పరిశీలించారు. పాశర్లపూడిలో నాబార్డ్ ఆధ్వర్యంలో గ్రామీణ దుకాణ్ ద్వారా వీటి అభివృద్ధికి చేస్తున్న కార్యశాలను పలువురు అధికారులు సైతం పర్యవేక్షించారు. పూర్తి నాణ్యతగా తయారు చేసేలా శిక్షణ ఇచ్చాక వాటికి నగరాలు, పట్టణాల్లో మార్కెటింగ్ సౌకర్యాలను కల్పించే దిశగా కార్యాచరణ చేయనున్నట్లు ఆక్సిజన్ అసోసియేషన్ అధ్యక్షుడు **కటికిరెడ్డి గంగాధర్** తెలిపారు.

కోస్తా రైలు మార్గానికి వినతి

సాంబమూర్తినగర్(కాకినాడ), న్యూస్‌టుడే: కోస్తా రైలు మార్గం నిర్మాణం చేపట్టాలని తూర్పుగోదావరి జిల్లా, కోకనాడ టౌన్ ప్రయాణికుల సంఘం, జెడ్ఆర్‌యూసీసీ సభ్యులు వైడీ రామారావు రైల్వే ఉన్నతాధికారులను కోరారు. రైల్వే సమస్యలపై దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్‌తో విజయవాడలో శుక్రవారం బోర్డు సమావేశం జరగనుంది. ఈ నేపథ్యంలో వైడీ రామారావు గురువారం మాట్లాడారు. కోస్తా తీరంలో వ్యవసాయ, పారిశ్రామిక, నౌక వాణిజ్యం, గ్యాస్, పెట్రోలియం, సముద్ర, జల ఉత్పత్తుల కేంద్రంగా ఉన్న గోదావరి కృష్ణా పరివాహక ప్రాంతాన్ని కలుపుతూ కోస్తా రైలు మార్గాన్ని ఏర్పాటు చేస్తే మేలు జరుగుతుందన్నారు. పోర్టు అభివృద్ధితో పాటు వ్యవసాయ, వాణిజ పంటల రవాణా సులభతరం అవుతుందన్నారు. ఉభయగోదావరి, కృష్ణా, గుంటూరు జిల్లాల ప్రజలకు ఎంతో ప్రయోజనకరమన్నారు.

నడుము, మోకాళ్ల నొప్పులకు ప్రత్యేక క్లినిక్

మసీదు సెంటర్ (కాకినాడ): కాకినాడ ప్రభుత్వ సామాన్య ఆసుపత్రిలోని ఎముకల వైద్య విభాగంలో 24గంటల ఆపరేషన్ థియేటర్ ప్రారంభించి ఏడాది పూర్తయ్యింది. ఈ సందర్భంగా నడుము, మోకాళ్ల నొప్పులు, పుట్టుకతో వచ్చే పాదాల వంకర్లకు ప్రత్యేక క్లినిక్ ఏర్పాటు చేశారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.లావణ్యకుమారి గురువారం దీన్ని ప్రారంభించారు. డీఎంఈ డా.నరసింహం సూచనల మేరకు ఆయా విభాగాల్లోని నిపుణులతో వైద్యం అందిస్తామని ఆర్థోపెడిక్ హెచ్‌వోడీ డా.పాండురంగ విఠల్ తెలిపారు. ఆర్‌ఎంసీ వైస్ ప్రిన్సిపల్ డా.ఎ.విష్ణువర్ధన్, డా.పార్థసారధి, డా.ముఖర్జీ, డా.వింధ్య, డా.ప్రసన్న, డా.రామ్‌కిషోర్ తదితరులు పాల్గొన్నారు.


జీజీహెచ్‌లో క్లినిక్ ప్రారంభిస్తున్న సూపరింటెండెంట్ లావణ్యకుమారి

నేటి నుంచి రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలు

శ్యామలాసెంటర్(రాజమహేంద్రవరం): జిల్లా అథ్లెటిక్ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం నుంచి మూడు రోజులపాటు రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించనున్నట్లు సంఘ కార్యదర్శి ఎన్.శివ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అండర్-14, 16, 18, 20 విభాగాల్లో జరిగే ఈ పోటీలకు రాష్ట్రంలోని పలు జిల్లాల నుంచి ఎంపికైన సుమారు 250 మంది క్రీడాకారులు పాల్గొంటారన్నారు.

పీఆర్ ఎస్ఈ బాధ్యతల స్వీకరణ

అమలాపురం కలెక్టరేట్, న్యూస్‌టుడే: డా.బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పంచాయతీ రాజ్ సూపరింటెండెంట్ ఇంజినీర్(ఎస్ఈ)గా పి.రామకృష్ణారెడ్డి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన ఇటీవల జరిగిన సాధారణ బదిలీల్లో భాగంగా కర్నూలు నుంచి ఇక్కడికి వచ్చారు. ఈయనకు డీఈలు అన్యం రాంబాబు, రాజ్‌కుమార్, ఇతర సిబ్బంది పూల మొక్కలతో స్వాగతం పలికారు. ఎస్ఈ మాట్లాడుతూ కోనసీమ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు.


ఎస్ఈ కృష్ణారెడ్డికి స్వాగతం పలుకుతున్న డీఈఈ రాంబాబు, రాజ్‌కుమార్

జాతీయ భావన పెంపొందించేందుకు ఎన్‌సీసీ దోహదం

ఎంపీ పురందేశ్వరి

రాజానగరం, న్యూస్‌టుడే: విద్యార్థి దశ నుంచే వారిలో జాతీయ భావన పెంపొందింపజేసేందుకు ఎన్‌సీసీ శిక్షణ ఎంతో దోహదపడుతుందని రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. గైట్ ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించిన ఎన్‌సీసీ ప్రత్యేక జాతీయ సమైక్యతా శిబిరాన్ని గురువారం ఆమె ప్రారంభించారు. ఎన్‌సీసీ వల్ల విద్యార్థుల్లో క్రమశిక్షణ, సమయ పాలన, దేశభక్తి కలుగుతాయన్నారు. భారతదేశ విలువలను భావి తరాలకు తెలిపేలా ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించాల్సి ఉందన్నారు. ప్రపంచ ఆర్థిక శక్తిగా ఎదుగుతున్న భారతదేశాన్ని అన్ని దేశాలు గుర్తిస్తున్నాయని.. సామాజిక విభజన తీసుకువచ్చేందుకు కొన్ని శక్తులు ప్రయత్నిస్తున్నాయన్నారు. వాటిని శక్తిమంతంగా ఎదుర్కొనేందుకు, జాతీయ సమైక్యతా భావన పిల్లల్లో బలంగా నాటేందుకు ఎన్‌సీసీ శిక్షణ కార్యక్రమాలు ఎంతగానో ఉపకరిస్తాయన్నారు. ఇటీవల విజయవాడలో సంభవించిన వరదల సమయంలోనూ ఎన్‌సీసీ వాలంటీర్ల సేవలు మరువలేనివన్నారు. తొలుత జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ఎంపీ ప్రారంభించారు. ఎన్‌సీసీ క్యాడెట్ల నుంచి గాడ్ ఆఫ్ ఆనర్ స్వీకరించారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో జీజీయూ ఛాన్సలర్ కేవీవీ సత్యనారాయణ రాజు (చైతన్యరాజు), పలువురు ఎన్‌సీసీ అధికారులు పాల్గొన్నారు.

- **వెబ్‌సైట్ ప్రారంభం:** జీజీయూ కొత్త వెబ్‌సైట్‌ను అధికారికంగా ఎంపీ ప్రారంభించారు. విద్యార్థులకు డిజిటల్ యాక్సెస్‌ను మెరుగుపరచడానికి ఈ వెబ్‌సైట్ కీలకంగా నిలుస్తుందన్నారు. యువ ఇంజనీర్లు నూతన ఆవిష్కరణలకు నాంది పలికి సాంకేతిక అభివృద్ధి ద్వారా దేశ పురోగతికి దోహదపడాలని పిలుపునిచ్చారు. జీజీయూ ఛాన్సలర్ కె.వి.వి.సత్యనారాయణ రాజు (చైతన్యరాజు) నూతనంగా ఆవిష్కరించిన జీజీయూ వెబ్‌సైట్ విద్యార్థులకు అందించే ప్రయోజనాలను వివరించారు. ఉపకులపతి డా.వి.చంద్రశేఖర్, రిజిస్ట్రార్ డా.పి.ఎం.ఎం.ఎస్.శర్మ, డైరెక్టర్ డా.ఎం.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.


జ్యోతి వెలిగిస్తున్న ఎంపీ


ఎన్‌సీసీ కేడెట్లతో ఎంపీ పురందరేశ్వరి, చైతన్యరాజు

శుద్ధమైన తాగునీటి సరఫరాకు రూ.5 కోట్ల ఓఎన్జీసీ నిధులు

మలికిపురం, న్యూస్‌టుడే: రాజోలు నియోజకవర్గంలో నాణ్యమైన తాగునీటి సరఫరాకు ర్యాపిడ్ శాండ్ ఫిల్టర్ ఏర్పాటు చేయడానికి ఓఎన్జీసీ సీఎస్ఆర్ ఫండ్స్ నుంచి రూ.5 కోట్లు మంజూరు చేసినట్లు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ తెలిపారు. రాజమహేంద్రవరం ఓఎన్జీసీ కార్యాలయంలో గురువారం ఎసెట్ మేనేజరు, ఇతర అధికారులతో ఆయన సమావేశమయ్యారు. గుడిమెళ్లంక, అంతర్వేదిపాలెం, తాటిపాక, ములికిపల్లి ప్రాంతాల్లోని రక్షిత పథకాల ద్వారా ప్రస్తుతం తాగునీరు సరఫరా అవుతోందని, ఇందులో నాణ్యత లేదన్నారు. ఈ నేపథ్యంలో నీటిశుద్ధి విభాగాలను ఆధునికీకరించాల్సిందిగా ఓఎన్జీసీ అధికారులను కోరానన్నారు. ఈ మేరకు వారు నిధుల మంజూరుకు అంగీకరించారని చెప్పారు. ఎమ్మెల్యేతో పాటు రాష్ట్ర మార్క్‌ఫెడ్ డైరెక్టరు గుండుబోగుల పెద్దకాపు తదితరులు పాల్గొన్నారు.

వైకాపా నాయకుడి భవనంలో జూద శిబిరం..?

మసీదుసెంటర్(కాకినాడ), న్యూస్‌టుడే: జూద శిబిరంపై దాడిచేసి పేకాట ఆడుతున్న పలువురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. కాకినాడ రెండో పట్టణ పోలీసుస్టేషన్ పరిధిలోని రామారావుపేట జిల్లా పరిషత్తు అతిథి గృహం ఎదురుగా నిర్మాణంలో ఉన్న రెండంతస్తుల భవనంలో జూదం ఆడుతున్నట్లు గురువారం పోలీసులకు సమాచారం వచ్చింది. ఆ మేరకు క్రైం సీఐ వి.కృష్ణ ఆధ్వర్యంలో స్పెషల్ పార్టీ పోలీసులు రెండు ఆటోల్లో వచ్చి దాడి చేశారు. ఆ భవనం నగరానికి చెందిన ఓ వైకాపా నేతదిగా సమాచారం. రూ.15 లక్షల నగదు స్వాధీనం చేసుకుని, 15 మందిని అదుపులోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. అందులో ప్రముఖ న్యాయవాది ఉన్నట్లు చెబుతున్నారు. సంబంధిత వివరాలను పోలీసులు గోప్యంగా ఉంచారు. తరచూ ఇక్కడకు ఎంతోమంది వచ్చి జూదం ఆడుతుంటారని స్థానికులు చెబుతున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.


నిర్మాణంలో ఉన్న భవనం

పర్యాటక కేంద్రంగా లోవ అభివృద్ధికి చర్యలు

తుని గ్రామీణం, న్యూస్‌టుడే: తలుపులమ్మ అమ్మవారి లోవ దేవస్థానాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపట్టినట్లు మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు తెలిపారు. గురువారం దేవస్థానంలో దసరా ఉత్సవాల ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్నారు. లోవ దేవస్థానానికి ప్రస్తుతం ఏటా రూ.9 కోట్ల ఆదాయం సమకూరుతుందన్నారు. పెరుగుతున్న భక్తుల సౌకర్యార్థం పాలకమండలి సూచనల మేరకు దేవస్థానం దిగువన సుమారు 50 ఎకరాల భూమిని సేకరించి పార్కింగ్, వసతి గదుల నిర్మాణానికి చర్యలు చేపట్టనున్నారు. ఆలయానికి రావడానికి వీలుగా తాళ్లూరు గ్రామం మీదుగా రెండో రహదారి నిర్మాణానికి ప్రణాళిక సిద్ధం చేయాల్సిందిగా సూచించారు. దీంతో దేవస్థానం సమగ్రాభివృద్ధికి మాస్టర్‌ప్లాన్ సిద్ధం చేయడంతోపాటు భక్తులకు సౌకర్యాల ఏర్పాటుకు నిధులు సమకూర్చేందుకు కేంద్రం, రాష్ట్ర పర్యాటక శాఖలకు ప్రతిపాదనలు అందిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఆలయానికి వచ్చే వృద్ధులు, చిన్నారులు కొండపైన ఉన్న అమ్మవారిని దర్శించుకునేందుకు అనువుగా ఎస్కలేటర్ ఏర్పాటుకు అధికారులు చొరవచూపడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో దేవస్థానం ఛైర్మన్ గొర్లి అచ్చినాయుడు, మాజీ ఛైర్మన్లు దూలం మాణిక్యం, కరపా అప్పారావు, పార్టీ నాయకులు సుర్ల లోవరాజు యనమల రాజేష్, మోతుకూరి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మాజీ మంత్రి యనమల

ధరవరలు

అంబాజీపేట కొబ్బరి మార్కెట్

కొబ్బరి (క్వింటాళ్ళలో)	ధర (రూ॥లలో)
కొత్తకొబ్బరి కురిడీ (వెయ్యింటికి):	12,000
పాతకాయ: గండేరా	17,500
గటగట	15,500
కొత్తకాయ: గండేరా	16,500
గటగట	14,500
నీటి కాయ (వెయ్యింటికి):	
పాత (ముక్కుడు) కాయ	15,000-15,500
కొత్త (పచ్చి) కాయ	14,000-14,500
కొబ్బరినూనె మార్కెట్:	
15 కిలోలు	3,750
కిలో	260

గమనిక: అంబాజీపేట కొబ్బరి మార్కెట్ ధరలు ప్రతి బుధ, శనివారాల్లో మాత్రమే మారుతాయి.

వెన్‌కాబ్ చికెన్ ధర కిలోకు రూ॥లో

ఫారంరేటు	118-00
రిటైల్ లైవ్	140-00
డ్రెస్డ్	203-00
స్కిన్‌లెస్	231-00

పీడీఎస్ బియ్యం అక్రమ నిల్వలపై విజిలెన్స్ దాడులు

రాయవరం, న్యూస్‌టుడే: డా.బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాయవరం మండలం పసలపూడిలో అక్రమంగా నిల్వ చేసి తరలిస్తున్న పీడీఎస్ బియ్యాన్ని విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు గురువారం పట్టుకున్నారు. పౌర సరఫరాల శాఖ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం... గ్రామంలోని జి.వెంకన్న షెడ్డును తనిఖీ చేయగా ఒక టాటా ఏస్ వాహనంలో 65 బస్తాలలో సుమారు 3,185 కిలోల పీడీఎస్ బియ్యాన్ని గుర్తించారు. రామచంద్రపురానికి చెందిన నల్లమిల్లి శ్రీనివాసరెడ్డి ఆయన గుమస్తా ఆర్.వీరబాబు సాయంతో వివిధ గ్రామాల్లోని ద్విచక్రవాహనదారుల నుంచి రూ.20కి కొనుగోలు చేసి, రూ.23కు జి.మామిడాడ పరిసర ప్రాంతాల్లోని చేపల చెరువులకు అమ్మకాలు జరుపుతున్నట్లు గుర్తించారు. రూ.5,46,419 విలువ చేసే బియ్యంతో పాటు, ఒక తూకం యంత్రం, వాహనాన్ని సీజ్ చేసి, 6ఎ కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అక్రమంగా బియ్యం తరలిస్తున్న వ్యక్తులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని రాయవరం పోలీసులకు సిఫార్సు చేశారు. ఈ సందర్భంగా రీజనల్ విజిలెన్స్ ఇన్‌చార్జి ఎస్పీ ఎం.స్నేహిత మాట్లాడుతూ రాజమహేంద్రవరం రీజనల్ మూడు జిల్లాల పరిధిలో పీడీఎస్ బియ్యం అక్రమ రవాణా, నిల్వలపై నిరంతర నిఘా కొనసాగుతుందన్నారు. చౌక బియ్యాన్ని కొనడం, అమ్మడం చేపడితే చట్టప్రకారం కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. తనిఖీలలో విజిలెన్స్ అధికారులు నాగ వెంకటరాజు, విజయ్‌కుమార్, కిషోర్, లోవరాజు, అలీషా పాల్గొన్నారు.



సీజ్ చేసిన వాహనంతో అధికారులు

దూసుకెళ్లిన బస్సు చక్రం.. ఒకరికి గాయాలు

తాళ్లరేవు: అమలాపురం నుంచి విశాఖపట్నం వెళ్తున్న ఆర్టీసీ బస్సు వెనుక చక్రం జార్జిపేట ఎంఎల్‌కే నగర్ వద్ద ఊడిపోయింది. బస్సు కొంత దూరం వెళ్లి ఆగింది. ఆ చక్రం 100 మీటర్లు దూసుకెళ్లి రోడ్డు పక్కన మాట్లాడుకుంటున్న ఇద్దరిలో ఒకరిని ఢీకొంది. ఆ ప్రమాదంలో చెల్లెవారిపేటకు చెందిన ముర్రే గాంధీ కాలు, చేతులు, తలకు గాయలయ్యాయి. ఆయనను తొలుత యానాం, అక్కడి నుంచి కాకినాడ ఆసుపత్రికి తరలించారు.


గాయపడిన గాంధీ



ఊడిన బస్సు చక్రాన్ని బిగిస్తున్న ఆర్టీసీ మెకానిక్‌లు

అయినవిల్లి సర్వసభ్య సమావేశం వాయిదా

అయినవిల్లి: మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఎంపీపీ ఎం.నాగవిజయలక్ష్మి అధ్యక్షతన సాధారణ సర్వసభ్య సమావేశం జరిగింది. ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు పూర్తిస్థాయిలో హాజరు కాలేదు. ఎంపీడీవో వెంకటాచార్య, ఏవో దీక్షితులు, కార్యాలయ సిబ్బంది సాధారణ బదిలీల్లో భాగంగా వెళ్లిపోవడంతో పాటు ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అందుబాటులో లేకపోవడంతో మరోసారి సమావేశం నిర్వహిస్తామని ఏవో తెలిపారు.

ఏకరూప దుస్తుల వితరణ

రాజోలు: రాజోలు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని పేద విద్యార్థులకు గూడపల్లికి చెందిన పితాని గోపీనాథ్, పితాని పాపారావులు రూ.20 వేలు విలువచేసే ఏకరూప దుస్తులను గురువారం అందజేశారు. దాతలను ప్రిన్సిపల్ పి.సాయిబాబు అభినందించారు.

రాజోలు

• రాజోలు • కొత్తపేట • పి.గన్నవరం

లక్కవరంలో కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు


మలికిపురం: లక్కవరం సబ్‌స్టేషనులో కాలిపోయిన 5 ఎంవీఏ ట్రాన్స్‌ఫార్మర్ స్థానంలో కొత్తది గురువారం ఏర్పాటు చేశారు. ఇక్కడి ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోవడంతో దీని పరిధిలో ఉన్న లక్కవరం, గుడిమెళ్లంక, మట్టపర్రు, రామరాజులంక, బట్టేలంక, శంకరగుప్తం, దిండి, మేడిచర్లపాలెం గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఈ నేపథ్యంలో పీసీసీ సభ్యుడు రుద్రరాజు గోపాలకృష్ణరాజు తదితరులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. సుమారు రూ.80 లక్షలతో కొత్త ట్రాన్స్‌ఫార్మర్‌ను రాజోలు డీఈ సీహెచ్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో గురువారం ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ చేసిన సూచన మేరకు త్వరలో ఇక్కడ 8 ఎంవీఏ సామర్థ్యానికి పెంచనున్నట్లు డీఈ చెప్పారు. ఇన్‌ఛార్జి ఏఈ బి.ప్రసాద్, రుద్రరాజు గోపాలకృష్ణరాజు, జి.బాలమురళీకృష్ణ, మల్లిక, వి.రఘురాజ్, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.


కొత్తపేట బంగారమ్మ తల్లి


సిరిపల్లి కొండాలమ్మ


కొమరాజులంక కనకదుర్గమ్మ


అంబాజీపేట వాసవీమాత


పి.గన్నవరంలో..


పెదపట్నంలంకలో శైలపుత్రి అలంకారం


తాటిపాకలో దుర్గాదేవి

శరణు.. శైలపుత్రి..

ఘనంగా ప్రారంభమైన దేవీ శరన్నవరాత్రి వేడుకలు

అమ్మా దుర్గమ్మా.. శరణు శరణు.. కాపాడు అంటూ భక్తుల శరణుఘోషతో ఆలయాల్లో సందడి వాతావరం నెలకొంది. దేవీ శరన్నవరాత్రులు రాజోలు, పి.గన్నవరం, కొత్తపేట నియోజకవర్గాల్లో గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. కమిటీల ఆధ్వర్యంలో ఆలయాలను విద్యుద్దీపాలతో సుందరంగా అలంకరించారు. చలువ పందిళ్లు వేశారు. కలశస్థాపనతో అమ్మవారికి అభిషేకాలు, చండీయాగాలను వేదమంత్రోచ్ఛారణలతో నిర్వహించారు. తొలిరోజు అమ్మవారు బాలాత్రిపురసుందరిగా దర్శనమిచ్చారు. కుంకుమ పూజలు, విశేషార్చనల్లో భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

● అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయానికి అనుబంధమైన శ్రీఅశ్వరూఢాంబిక(గుర్రాలక్కమ్మ) ఆలయంలో అమ్మవారికి ఏసీ వి.సత్యనారాయణ పట్టువస్త్రాలు బహూకరించారు.

● రాజోలులో దుర్గాదేవి ఆలయాల వద్ద చలువ పందిళ్లు వేసి విద్యుత్తు దీపాలతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. ఉదయం నుంచి కుంకుమార్చన, ప్రత్యేక పూజలు నిర్వహించారు. దర్శనానికి భక్తులు బారులుతీరారు. రాజోలు శ్రీగణపతి ప్రయుక్త దుర్గాంబా ఆలయంలో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని కుంకుమ పూజలు చేశారు.

- న్యూస్‌టుడే, రాజోలు, ఆత్రేయపురం, రావులపాలెం గ్రామీణం, ఆలమూరు, కొత్తపేట, అయినవిల్లి, రావులపాలెం పట్టణం, అంబాజీపేట, మలికిపురం, అంతర్వేది, పి.గన్నవరం, మామిడికుదురు

మేమున్నాం.. మీకు తోడుగా

పుల్లేటికుర్రులో పరిసరాల శుభ్రం

స్పందనకు వందనం

అంబాజీపేట: అంబాజీపేట మండలం పుల్లేటికుర్రు ప్రధాన, ఉన్నత పాఠశాల, పల్లపు వీధుల్లో పరిసరాలను పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులు శుభ్రం చేశారు. ఆయా ప్రాంతాల్లో వ్యర్థాలు ఎక్కువగా పేరుకుపోయినట్లు కొందరు స్థానికులు 'ఈనాడు మేమున్నాం.. మీకు తోడుగా' దృష్టికి తీసుకువచ్చారు. ఇదే విషయాన్ని సర్పంచి జల్లి బాలరాజు, కార్యదర్శి వి.వి.రమణ వద్ద ప్రస్తావించగా వారు స్పందించి ఆయా ప్రాంతాలను శుభ్రం చేయించారు.

చెత్తాచెదారం తొలగించారు

మలికిపురం: తూర్పుపాలెం ప్రధాన, పంచాయతీ రహదారుల పక్కన ఉన్న తుప్పలు, పనికిరాని మొక్కలు, చెత్తాచెదారం తొలగించి శుభ్రం చేశారు. గ్రామంలో రోడ్ల వెంబడి అపరిశుభ్రంగా దుర్వాసన వస్తున్న క్రమంలో 'మేమున్నాం.. మీకు తోడుగా' ద్వారా సర్పంచి గుబ్బింక మురళీవెంకటసత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి ఎస్‌డీఎస్ ప్రసాద్‌ల దృష్టికి తేగా స్పందించిన వారు చర్యలు చేపట్టారు.

పూడిక తీశారు..

రావులపాలెం పట్టణం: రావులపాలెంలోని ఇందిరా కాలనీలో కాలువల్లోని పూడిక తీయకపోవడంతో మురుగునీరు ముందుకు పారక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. స్థానికులు ఈనాడు 'మేమున్నాం.. మీకు తోడుగా' దృష్టికి తీసుకుని వచ్చారు. సమస్యను పంచాయతీ కార్యదర్శి ఎల్.దుర్గాప్రసాద్ దృష్టికి తీసుకుని వెళ్లడంతో సిబ్బందిని పంపి శుభ్రం చేయించారు.

మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు: రాజోలు: 80085 74174
పి.గన్నవరం: 80085 74229 కొత్తపేట:90323 93884

ఆశలు చిగురిస్తున్న వేళ..

● కానిస్టేబుల్ ఉద్యోగాల భర్తీ ప్రకటనతో యువతలో ఉత్సాహం

వైకాపా ప్రభుత్వ హయాంలో అర్ధాంతరంగా నిలిపివేసిన కానిస్టేబుల్ ఉద్యోగాల నియామక ప్రక్రియను తిరిగి ప్రారంభించనున్నట్లు హోంమంత్రి అనిత ఇటీవల ప్రకటించిన నేపథ్యంలో యువతలో ఆశలు చిగురిస్తున్నాయి. అయిదు నెలల్లో నియామక ప్రక్రియ పూర్తి చేస్తామని చెప్పడంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు. - న్యూస్‌టుడే, అంబాజీపేట


అంబాజీపేట ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో యువత

రాష్ట్రంలో 6,100 కానిస్టేబుల్ ఉద్యోగాల భర్తీకి 2022 నవంబర్‌లో అప్పటి వైకాపా ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది. అనంతరం ఎమ్మెల్సీ ఎన్నికలు, ఇతరత్రా కారణాలతో ఆ ప్రక్రియ నిలిచిపోయింది. ఇప్పుడు మళ్లీ కూటమి ప్రభుత్వం భర్తీకి చర్యలు చేపట్టడంతో ఆ ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న అభ్యర్థులకు ఊరటనిస్తోంది. ఇందుకోసం తగిన శిక్షణ ఇప్పటికే ప్రారంభించారు. లక్ష్య సాధన దిశగా సాగుతున్నట్లు చెబుతున్నారు.

అంబాజీపేటలో శిక్షణ

కానిస్టేబుల్ ఉద్యోగాల కోసం అభ్యర్థులకు అంబాజీపేటలో ఉచిత శిక్షణ ఏర్పాటు చేశారు. విజయవాడ డీసీపీ మోకా సత్తిబాబు ఆధ్వర్యంలో స్థానికంగా ఉన్న ఉపాధ్యాయుడు నందిక వెంకటేశ్వరరావు, పీఈటీ శాంతిరాజులు ఇక్కడ ఏర్పాటు చేసిన కేంద్రంలో గతంలో శిక్షణ ఇచ్చారు. తాజాగా తిరిగి ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు వారు వెల్లడించారు.

మరింత పట్టుదలతో..



గతంలో ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ రావడంతో కానిస్టేబుల్ ఉద్యోగాల ఎంపిక నిలిచిపోయింది. ఈసారి ఎలాగైనా ఉద్యోగం సాధిస్తాను. అందుకు గతంలోనే శిక్షణ తీసుకున్నాను. ఇప్పుడు మరింత పట్టుదలతో ప్రయత్నం చేస్తాను.

- టి.ప్రియమల్లిక, అంబాజీపేట

సాధన చేస్తున్నా..



మాది మధ్యతరగతి కుటుంబం. మా నాన్న వడ్రంగి మేస్త్రీగా పనిచేస్తున్నారు. చిన్నప్పటినుంచి కానిస్టేబుల్ ఉద్యోగం అంటే ఇష్టం. దాంతో ఇక్కడ శిక్షణ తీసుకున్నాను. గత ప్రభుత్వంలో పోస్టుల ప్రక్రియ వివిధ కారణాలతో నిలిచిపోయింది. ఇప్పుడు ఈ ప్రభుత్వం చర్యలు తీసుకుంటామని చెప్పడంతో సాధన చేస్తున్నాను.

- కె.సచిన్, మేడేకుర్రు, కొత్తపేట మండలం

ఉద్యోగాల ఖాళీల వివరాలు: తూర్పుగోదావరి జిల్లాలో: 298 రాజమహేంద్రవరం అర్బన్‌లో: 83

జిల్లాస్థాయి పోటీలకు మెర్లపాలెం విద్యార్థులు

ఆత్రేయపురం: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ నిర్వహించిన జిల్లాస్థాయి క్రీడా పోటీల్లో మెర్లపాలెం జడ్పీ పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపారు. వారిలో మెర్ల శ్రీదుర్గాలక్ష్మి, రంకిరెడ్డి కల్యాణి రేవతి, కొటారి యమున, చింతల అనూష, అత్తిలి హర్షవర్ధన వెంకటరమణ, బొలిశెట్టి హేమ వెంకట నాగశ్రీ జిల్లాస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు సీహెచ్ శ్రీహరి, ఫిజికల్ డైరెక్టర్ ఎస్.శ్రీకాంత్ గురువారం తెలిపారు.

మితిమీరిన ఎరువులు వాడొద్దు

అంబాజీపేట: రైతులు తమ పంటలకు మితిమీరిన రసాయనిక ఎరువులు, పురుగుమందులు వాడొద్దని వ్యవసాయాధికారి విజయకుమార్ సూచించారు. పుల్లేటికుర్రు పంచాయతీ కార్యాలయం వద్ద గురువారం 'పొలం పిలుస్తోంది..' కార్యక్రమాన్ని సర్పంచి జల్లి బాలరాజు అధ్యక్షతన నిర్వహించారు. వివిధ శాఖల అధికారులు, రైతులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ శ్రేణుల పరామర్శ

మామిడికుదురు, న్యూస్‌టుడే: పితృ వియోగంతో బాధపడుతున్న కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అప్పన శ్రీరామకృష్ణను పలువురు నాయకులు బాడిలంకలో గురువారం పరామర్శించారు. పీసీసీ మాజీ కార్యదర్శి మహ్మద్ ఆరిఫ్, ఎం.శివన్నారాయణ, ఎం.మోహనరావు తదితరులు పరామర్శించిన వారిలో ఉన్నారు.



విజయభారతి సాహిత్యం ఆదర్శనీయం

మామిడికుదురు, న్యూస్‌టుడే: ఫులె, అంబేడ్కర్ జీవిత చరిత్రలతో పాటు ఎన్నో గ్రంథాలను రచించిన మహాకవి పద్మభూషణ్ బోయి భీమన్న తనయ డాక్టర్ బి.విజయభారతి సాహిత్యం అందరికీ ఆదర్శమని ఎస్సీ సంక్షేమ సంఘ నాయకులు తెలిపారు. స్థానిక అంబేడ్కర్ సామాజిక భవనంలో గురువారం జరిగిన సంతాప సభలో పలువురు నివాళి అర్పించారు. సంఘ జిల్లా అధ్యక్షుడు బత్తుల నకులరాజు అధ్యక్షతన జరిగిన సమావేశంలో గోసంగి బంగార్రాజు, కుసుమ శ్రీధర్, సాదనాల సత్యనారాయణ, భూపతి మనోహర్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

విజయబేతాళస్వామి కలశ స్థాపన ఊరేగింపు

అంబాజీపేట: అంబాజీపేటలో విజయబేతాళ స్వామి వాహన మహోత్సవ కలశస్థాపన ఊరేగింపును గురువారం అంబాజీపేటలో ఘనంగా నిర్వహించారు.


ఊరేగింపులో యువకుల విన్యాసాలు

మాచవరంలోని దుర్గారామ్‌ఘాట్ క్షేత్రం నుంచి పురవీధుల్లో కలశాలతో పాటు దీపాన్ని ఊరేగిస్తూ స్థానిక బేతాళస్వామి ఆలయానికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా యువకుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. ఉత్సవ కమిటీ, శెట్టిబలిజ అభ్యుదయ సంక్షేమ సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఉత్తమ సేవలకు గుర్తింపుగా సత్కారం

అంబాజీపేట, న్యూస్‌టుడే: స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా అందించిన సేవలకు గాను మాచవరం సర్పంచి నాగాబత్తుల శాంతకుమారికి ఉత్తమ పురస్కారం లభించింది. దీనికి సంబంధించి ప్రశంసాపత్రాన్ని అమలాపురం ఎంపీ గంటి హరీష్‌మాథుర్ చేతుల మీదుగా బుధవారం అమలాపురంలో జరిగిన ఓ కార్యక్రమంలో ఆమెకు అందజేశారు. గంగలకుర్రుఅగ్రహారం పంచాయతీ కార్యదర్శి ఎస్.సత్యవేణికి కూడా ఈ పురస్కారం దక్కింది.


మాచవరం సర్పంచి శాంతకుమారిని సన్మానిస్తున్న ఎంపీ హరీష్

జిల్లా ఉత్తమ ఉపాధ్యాయినికి ..

అంబాజీపేట: జిల్లా ఉత్తమ ఉపాధ్యాయినిగా ఇటీవల పురస్కారం అందుకున్న జక్కంశెట్టి సంధ్య దంపతులను ఇసుకపూడి దాసరివారిపేట అభ్యుదయ యువజన సంక్షేమ సేవా సంఘం ఆధ్వర్యంలో గురువారం సన్మానించారు. ఎంపీటీసీ మాజీ సభ్యుడు కోట విజయరాజు, ఎస్ఎంసీ ఛైర్మన్ నెల్లి ప్రసన్న, కత్తుల సత్యనారాయణ, వెంకటేష్, గంటా గిరి పాల్గొన్నారు.

జూద శిబిరంపై దాడి

రాజోలు: తాటిపాకలో గురువారం జూద శిబిరంపై దాడిచేసి ఐదుగురిని అరెస్ట్ చేశామని రాజోలు ఎస్సై బి.రాజేష్‌కుమార్ తెలిపారు. వారివద్ద నుంచి రూ.6,560 నగదు, ఐదు ద్విచక్రవాహనాలు స్వాధీనం చేసుకున్నామని చెప్పారు.

నిధుల వ్యయంపై వివరాలకు డిమాండ్

మామిడికుదురు, న్యూస్‌టుడే: మండల పరిషత్ ద్వారా ఖర్చుచేసిన నిధుల వివరాలను ఇవ్వాలంటూ సభ్యులు డిమాండు చేశారు. ఎంపీపీ కుసుమ వనజకుమారి అధ్యక్షతన స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం జరిగిన సర్వసభ్య సమావేశంలో ఈ అంశంపై వాగ్వాదం చోటుచేసుకుందది. దీనిపై లిఖితపూర్వక సమాధానమివ్వాలని లూటుకుర్రు సర్పంచి అడబాల తాతకాపు కోరగా ఏవో జి.వెంకటేశ్వరరావు కల్పించుకోవడంతో ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. దీనిపై ఎంపీటీసీ సభ్యులు కొమ్ముల జంగమయ్య, వర్ధినీడి తులసీరామ్ మధ్య కూడా ఇదే పరిస్థితి నెలకొంది. ర.భ.శాఖ ద్వారా మండలంలో 9 రోడ్ల మరమ్మతులకు రూ.2.6 కోట్లు మంజూరయ్యాయని, రూ.32.8 కోట్లతో నాలుగుచోట్ల రోడ్ల విస్తరణకు ప్రతిపాదనలు పంపామని ఏఈఈ సురేష్ తెలిపారు. గతంలో గృహనిర్మాణానికి సంబంధించి 1,572 ఇళ్లు వివిధ దశల్లో నిలిచిపోయినట్లు సర్వే ద్వారా నమోదు చేశామని ఏఈ అయ్యప్పనాయుడు వివరించారు. మరమ్మతులకు గురైన పాఠశాలలకు సత్వర కార్యాచరణ కోసం ప్రతిపాదనలు చేసి పంపామని ఎంఈవో-2 మోకా వెంకన్నబాబు తెలిపారు. తాగునీటి ఇబ్బందులను పరిష్కరించేందుకు పాశర్లపూడి సమగ్ర రక్షిత మంచినీటి ప్రాజెక్టులోని నీటిశుద్ధి విభాగాల మరమ్మతులకు ప్రతిపాదనలను రూపొందించినట్లు ఏఈ జయశ్రీ చెప్పారు. పలు గ్రామాల్లో అర్ధాంతరంగా నిలిచిపోయిన రైతు సేవాకేంద్రాలు, వెల్‌నెస్, సచివాలయ భవన నిర్మాణాలను వెంటనే పూర్తిచేయాలని సభ్యులు విన్నవించారు. వైస్ ఎంపీపీ భూపతిరాజు లక్ష్మి, ఎంపీడీవో కె.వెంకటేశ్వరరావు, ఉప తహసీల్దారు శరణ్య, మండల సర్పంచుల సమాఖ్య అధ్యక్షురాలు జాలెం రమణకుమారి పాల్గొన్నారు.


సమావేశంలో ఎంపీటీసీ సభ్యుల వాగ్వాదం


అంతర్వేది దేవస్థానానికి మైకు బహూకరణ

అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయానికి అగ్నికుల క్షత్రియ కువైట్ యువ పల్లవసేన సంఘం(అంతర్వేది పల్లవపాలెం) రూ.1.50 లక్షల విలువైన మైకు, సౌండ్ సిస్టం పరికరాలను సమకూర్చారు. గురువారం వీటిని ఆలయ అసిస్టెంట్ కమిషనరు వి.సత్యనారాయణకు అందజేశారు. - న్యూస్‌టుడే, అంతర్వేది

ఎస్సీ వర్గీకరణను అడ్డుకుంటాం

రాజోలు, న్యూస్‌టుడే: ఎస్సీ వర్గీకరణను అడ్డుకోవడానికి ఉద్యమాన్ని ఉద్ధృతం చేస్తామని మాలల న్యాయ పోరాట సమితి ఐకాస నాయకులు తెలిపారు. సోంపల్లిలో వైఎస్ ఎంపీపీ పొలమూరి శ్యాంబాబు అధ్యక్షతన గురువారం నాలుగు మండలాల ఐకాస సమావేశం నిర్వహించారు. అధ్యక్షుడిగా చింతా రాజబాబు, గౌరవాధ్యక్షులుగా బొంతు మణిరాజు, విప్పర్తి సాయిబాబును ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాలలందరినీ ఏకం చేసి వర్గీకరణకు వ్యతిరేకంగా పోరాటం చేస్తామన్నారు. అనంతరం కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో బత్తుల మురళీకృష్ణ, జనార్దనరావు, తోటే రాజేష్ తదితరులు పాల్గొన్నారు.


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఐకాస నాయకులు

మందపల్లి దేవస్థానం డీసీగా చక్రధర్

కొత్తపేట: మందపల్లి దేవస్థానం నూతన ఇన్‌ఛార్జి సహాయ కమిషనర్, కార్యనిర్వాహణాధికారిగా నల్లం సూర్యచక్రధర్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం ఈయన వాడపల్లి దేవస్థానంలోనూ రెగ్యులర్ డీసీగా వ్యవహరిస్తున్నారు. ఇక్కడ పనిచేసిన ఏసీ సత్యనారాయణరాజు అయినవిల్లి దేవస్థానానికి రెగ్యులర్‌గా వెళ్లారు. ఈ సందర్భంగా నల్లం సూర్యచక్రధర్ మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని తెలిపారు. రవికుమార్, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.


డీసీ చక్రధర్‌కు స్వామివారి చిత్రపటాన్ని అందిస్తున్న ఆలయ సిబ్బంది

అంతర్జాతీయ సదస్సుకు ఆహ్వానం

మామిడికుదురు, న్యూస్‌టుడే: మామిడికుదురులోని దీప్తి డిగ్రీ కళాశాల ఫిజిక్స్, ఎలక్ట్రానిక్స్ విభాగాధిపతి డాక్టర్ యర్రంశెట్టి విజయ్‌సత్యప్రసాద్‌కు యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లోని అబుదబిలో జరగనున్న నానో స్ట్రక్చర్డ్ మెటీరియల్స్-2024 అంతర్జాతీయ సదస్సుకు ఆహ్వానం అందింది. నవంబరు 3 నుంచి 8 వరకు జరగనున్న ఈ సదస్సులో నానో పదార్థాల శక్తి, ఫోటోన్, ఎలక్ట్రానిక్ అప్లికేషన్స్‌పై తాను ప్రసంగించనున్నట్లు గురువారం ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. దీనికి సంబంధించి గతంలో తాను పరిశోధన పత్రాన్ని సమర్పించానన్నారు. కళాశాల ప్రిన్సిపల్ డీవీవీ సత్యనారాయణ, సహ అధ్యాపకులు ఆయన్ని అభినందించారు.


విజయ్‌సత్యప్రసాద్

సాగునీరు అందక.. ముంపు వీడక..

వేలాది ఎకరాలకు సాగు, అనేక గ్రామాలకు తాగునీరు అందించే పంట కాలువలను పట్టించుకోకపోవడంతో ఆక్రమణలతో పాటు తూడు, గుర్రపుడెక్క పెరిగిపోతోంది. ఇటీవల కురిసిన భారీవర్షాలకు సకాలంలో ముంపునీరు కిందకు దిగకపోవడంతో పాటు శివారున ఉన్న పంటచేలకు సాగునీటికి ఇబ్బందులు తప్పడం లేదని అన్నదాతలు వాపోతున్నారు. - న్యూస్‌టుడే, అయినవిల్లి

పి.గన్నవరం నియోజకవర్గంలో 23,500 ఎకరాల్లో అన్నదాతలు వరిసాగు చేస్తున్నారు. అయినవిల్లి మండలంలో సుమారుగా 8,300 ఎకరాల్లో సాగవుతోంది. వీటికి సాగునీరు అందించేందుకు రెండు ప్రధాన పంట కాలువలు.. వాటికి అనుబంధంగా పది వరకు చిన్న కాలువలు ఉన్నాయి వీటిని గతంలో సాగునీటి సంఘాలు పర్యవేక్షణ చేసేవి. ఎటువంటి సమస్యలు ఉన్న వారు ఎప్పటికప్పుడు అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేవారు. గత వైకాపా ప్రభుత్వం ఐదేళ్ల కాలంలో వీటి నిర్వహణ గాలికి వదిలేయడంతో పాటు సాగునీటి సంఘాలను రద్దు చేయడంతో పరిస్థితి గాడి తప్పింది. దీంతో ప్రధాన కాలువలు ఆక్రమణలతో పాటు పూడికలు పెరిగిపోయి రోజురోజుకు కుచించుకుపోతున్నాయి.

● బొబ్బర్లంక-ముక్తేశ్వరం ప్రధాన పంట కాలువ పరిధి మడుపల్లి, కొండుకుదురు, తొత్తరమూడి గ్రామాల్లో కాలువ నిండా తూడు అల్లుకుని నీటి ప్రవాహానికి ఆటంకాలు కలుగుతున్నాయి. కొండుకుదురులో భారీచెట్టు కాలువలో కూలిపోవడంతో అక్కడ చెత్తా, ఇతర వ్యర్థాలు పేరుకుపోయాయి.


విలస ఛానల్‌లో పేరుకుపోయిన తూడు

● విలస ఛానల్ అయినవిల్లి మండలంతో పాటు ముమ్మిడివరం మండలంలోని అనేక గ్రామాలకు సాగునీటికి ఆధారం.


బొబ్బర్లంక-ముక్తేశ్వరం పంటకాలువలో కొండుకుదురు వద్ద ఇలా..

సిరిపల్లి, మాగం, పోతుకుర్రు గ్రామాల్లో తూడు, గుర్రపుడెక్క, గడ్డి అల్లుకొని నీటి ప్రవాహం తగ్గిపోయిందని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు పరిశీలించి వాటిని తొలగించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

కాలువలను పరిరక్షిస్తాం..

పంట కాలువలు పరిశీలిస్తాం. తూడు, గుర్రపుడెక్క తొలగిస్తాం. నీటి ప్రవాహానికి ఆటంకాలు లేకుండా చూస్తాం. రైతులకు ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకుంటాం.

- బి.శ్రీనివాసరావు, డీఈఈ, నీటిపారుదలశాఖ

ఆర్డీవోగా బాధ్యతల స్వీకరణ

కొత్తపేట, న్యూస్‌టుడే: కొత్తపేట రెవెన్యూ డివిజనల్ అధికారిగా పి.శ్రీకర్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. సాధారణ బదిలీల్లో భాగంగా ఉన్నతాధికారులు ఈయనను గుంటూరు జిల్లా నుంచి కొత్తపేటకు బదిలీ చేశారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఆయన అన్నారు.


శ్రీకర్

అంబాజీపేట సబ్‌రిజిస్ట్రార్‌గా జగన్మోహనరావు

అంబాజీపేట, న్యూస్‌టుడే: అంబాజీపేట సబ్‌రిజిస్ట్రార్‌గా యు.జగన్మోహనరావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన రామచంద్రపురం నుంచి బదిలీపై వచ్చారు. అందరి సహకారంతో పనిచేస్తానన్నారు.



వీరేశ్వరస్వామి ఆలయంలో చండీహోమం


చండీహోమం నిర్వహిస్తున్న దృశ్యం

ఐ.పోలవరం: మురమళ్ల వీరేశ్వరస్వామి ఆలయంలో గురువారం చండీహోమం నిర్వహించారు. శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని ఆలయంలో 10 రోజుల పాటు చండీహోమం ఏర్పాటు చేసినట్లు ఆలయ సహాయ కమిషనర్ మాచిరాజు లక్ష్మీనారాయణ తెలిపారు. అర్చకులు పేటేటి శ్యామలకుమార్ ఆధ్వర్యంలో హోమం చేశారు. కేశనకుర్రు, పాలెం, కొమరగిరి, తిళ్లకుప్ప, ఎదుర్లంక, జి.వేమవరం తదితర గ్రామాల్లోని విజయదుర్గ అమ్మవారి ఆలయాల్లో శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి.

అమలాపురం

• అమలాపురం • ముమ్మిడివరం

అమ్మవారికి మంత్రి సుభాష్ పూజలు

అమలాపురం పట్టణం, న్యూస్‌టుడే: అమలాపురంలోని శ్రీదేవి అమ్మవారిని రాష్ట్ర కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ గురువారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు బోణం సత్యవరప్రసాద్, ఆశెట్టి ఆదిబాబు, జి.బుజ్జి, పిండి రాజా స్వాగతం పలికారు.


శ్రీదేవి అమ్మవారిని దర్శించుకుంటున్న మంత్రి సుభాష్

అమ్మ వైభవం.. భక్తుల పరవశం


అమలాపురంలోని వేపచెట్టు కనకదుర్గ అమ్మవారి ఆలయంలో ఎంపీ హరీష్ మాధుర్


యానంలో శారదా దేవి అమ్మవారు


అమలాపురంలోని వెంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో స్వర్ణకవచాలంకృత దుర్గాదేవిగా శ్రీవేపచెట్టు కనకదుర్గ అమ్మవారు


ముమ్మిడివరం మండలం చిన కొత్తలంకలో..


భట్నవిల్లిలో శ్రీబాలా త్రిపుర సుందరీదేవిగా..


అమలాపురంలో అభిషేక జలాల కలశాలతో ఆర్యవైశ్య మహిళలు

న్యూస్‌టుడే, బృందం

దసరా శరన్నవరాత్రుల ప్రారంభ మహోత్సవాలు గురువారం ఘనంగా నిర్వహించారు. శ్రీదేవి మార్కెట్ కూడలిలోని శ్రీదేవి అమ్మవారు స్వర్ణకవచాలంకృత దుర్గాదేవి రూపంలో దర్శనమిచ్చారు. వాసవీమాతను శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారిగా ప్రత్యేక అలంకరణ చేశారు. మహిళలు పసుపు చీరలు ధరించి 108 కలశాలతో గడియారస్తంభం నుంచి వాసవీమాత ఆలయం వరకు ఊరేగింపు యాత్ర చేపట్టారు. ముమ్మిడివరం హైస్కూల్ సెంటర్‌లోని విజయదుర్గ అమ్మవారికి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. క్రాపచింతలపూడి, చినకొత్తలంక, వాసవీకన్యకాపరమేశ్వరి సత్రం, అగ్రహారం, మట్లపాలెం, పల్లిపాలెం, పెద్దపంతెన వద్ద ఆలయాల్లో పూజలు చేశారు. కాట్రేనికోనలోని సుబ్రహ్మణ్యేశ్వరగుడి వద్ద కనకదుర్గమ్మతల్లి ఆలయంలో అమ్మవారికి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. కూనవరం విజయదుర్గమ్మ అమ్మవారి ఆలయంలో కుంకుమ పూజలు నిర్వహించారు. కల్వకొలను వీధిలోని వేపచెట్టు కనకదుర్గ అమ్మవారి ఆలయంలో 34వ వార్షికోత్సవం నిర్వహించారు. ఎంపీ హరీష్ మాధుర్ శతచండీ సహిత రుద్రయాగంలో పాల్గొన్నారు. ఉప్పలగుప్తం ఎస్ కాలనీలో శ్రీమహిషాసురమర్దిని అమ్మవారికి పూజలు చేశారు. ఆర్గనైజేషన్ ఆఫ్ ఛాంబర్ అధ్యక్షుడు తాతాజీ, భాజపా జిల్లా అధ్యక్షుడు యాళ్ల దొరబాబు పాల్గొన్నారు. యానాం పడవలరేవు వీధిలో శ్రీలలితాదేవి ఆలయం వద్ద ఉత్సవాలను ప్రారంభించారు. గోపాల్, రాధానగర్, గాంధీనగర్, శ్రీరామనగర్, సాయిరామ్ నగర్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.


బాలాత్రిపుర సుందరీదేవి అలంకరణలో అమ్మవారు

సమగ్ర శిక్ష ఉద్యోగుల నిరసన

ముమ్మిడివరం: డా.బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా సమగ్ర శిక్ష పరిధిలోని అన్ని విభాగాల్లో పనిచేస్తున్న ఒప్పంద ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం నిరసన కార్యక్రమం చేపట్టారు. స్థానిక కాశివారితూము వద్ద అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఎయిమ్స్‌లోని సమగ్ర శిక్ష జిల్లా కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. రెండు నెలలుగా జీతాలు లేక ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు.

సిబ్బందికి అభినందన

కాట్రేనికోన: కాట్రేనికోనకు చెందిన గుత్తుల సీత అనారోగ్యంతో మామిడికుదురు మండలంలోని పాశర్లపూడిలో ఉంటున్నారు. సచివాలయ ఉద్యోగి సందీప్ అక్కడికి వెళ్లి ఆమెకు పింఛను అందించారు. ఆయనను సర్పంచి గంటి సుధాకర్ తదితరులు అభినందించారు.

డంపింగ్‌యార్డు సమస్య పరిష్కరించాలని నిరసన

అమలాపురం గ్రామీణం: బండారులంకలోని జనవాసాల చెంతనే ఏర్పాటు చేసిన డంపింగ్‌యార్డును తొలగించాలని శివాలయం వద్ద గ్రామస్థులు గురువారం నిరసన తెలిపారు. అధికారులకు మొరపెట్టుకున్నా తమగోడు వినడం లేదని వాపోయారు. తక్షణమే డంపింగ్‌యార్డును తొలగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో దైవపు పూర్ణిమ, చింతా మణి, కొండా మల్లి, బిళ్ల లక్ష్మి, కొండా సూర్యకుమారి, బండారు నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.


బండారులంకలో నిరసన తెలుపుతున్న గ్రామస్థులు

రెవెన్యూ అంశాలపై అవగాహన అవసరం

అమలాపురం కలెక్టరేట్, న్యూస్‌టుడే: రెవెన్యూ అంశాల పట్ల అధికారులు, సిబ్బంది పూర్తి స్థాయి అవగాహన కలిగి ఉండాలని జేసీ నిశాంతి పేర్కొన్నారు. గురువారం కలెక్టరేట్‌లో రెవెన్యూ శాఖపై ఆమె సమీక్ష నిర్వహించారు. అసైన్డ్ భూములు, రిజిస్ట్రేషన్ తదితర నివేదికలను సకాలంలో జిల్లా అధికారులకు అందించాలని సూచించారు. జిల్లాకు సంబంధించి రెండు అంశాలు పెండింగ్‌లో ఉన్నాయని, తక్షణం వాటిని పరిష్కరించి దస్త్రాలను రాష్ట్ర భూ పరిపాలనా కార్యాలయానికి పంపాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీఆర్వో వెంకటేశ్వర్లు, మదన్‌మోహన్ రావు, ఇతర అధికారులు పాల్గొన్నారు. గురువారం అమరావతి నుంచి అదనపు భూ పరిపాలన మఖ్య కమిషనర్ ప్రభాకర రెడ్డి దూర దృశ్య సమావేశం నిర్వహించి పలు రెవెన్యూ అంశాలపై సమీక్ష నిర్వహించారు.


రెవెన్యూ అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న జేసీ నిశాంతి

విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ నిలుపుదలకు డిమాండ్


నిరసన వ్యక్తం చేస్తున్న కార్మిక సంఘం నాయకులు

అమలాపురం కలెక్టరేట్: విశాఖ ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణను నిలుపుదల చేయాలని కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. సీఐటీయూ ఆధ్వర్యంలో గురువారం కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ ఐ.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ విశాఖ ఉక్కు కర్మాగారం 32 మంది ప్రాణ త్యాగాలు, 67 మంది ప్రజాప్రతినిధుల రాజీనామా, రైతులు 32వేల ఎకరాల భూమి త్యాగంతో వచ్చిందన్నారు. అనంతరం కలెక్టరేట్ అధికారులకు వినతి పత్రం అందజేశారు. సత్తిబాబు, నూకల బలరాం, కారెం వెంకటేశ్వరరావు, అయితాబత్తుల సుభాషిణి, రామచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

తెదేపా సభ్యత్వ నమోదు చేయించాలి

అమలాపురం పట్టణం, న్యూస్‌టుడే: అమలాపురం నియోజకవర్గంలోని తెదేపా సభ్యత్వం నమోదు చేయించాలని యూనిట్, బూత్ ఇంఛార్జులను ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు ఆదేశించారు. అమలాపురంలోని తెదేపా కార్యాలయంలో పట్టణ అధ్యక్షుడు తిక్కిరెడ్డి నేతాజీ ఆధ్వర్యంలో గురువారం సమావేశం నిర్వహించారు. డి.సత్తిబాబురాజు, మల్లుల పోలయ్య, అరిగెల నానాజీ తదితరులు పాల్గొన్నారు.


తెదేపా కార్యాలయంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆనందరావు

జాతీయ రహదారి పనులు ప్రారంభించాలి

అమలాపురం కలెక్టరేట్, న్యూస్‌టుడే: జాతీయ రహదారి 216 విస్తరణ పనులకు సంబంధించి పాశర్లపూడి, మామిడికుదురు గ్రామాల్లోని అభ్యంతరాల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను కలెక్టర్ మహేష్‌కుమార్ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో 216 జాతీయ రహదారి పనులపై సమీక్ష నిర్వహించారు. ర.భ శాఖ అధికారులు ఈ రహదారి నిర్మాణానికి అడ్డంకిగా ఉన్న భవనాలను గుర్తించి వాటి విలును గణించాలన్నారు. ఈ రహదారి విస్తరణలో భాగంగా గెద్దాడలో మరో చోట శ్మశాన వాటికకు స్థలం కేటాయించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో జేసీ నిశాంతి, ఆర్డీఓ కె.మాధవి, ర.భ శాఖ ఈఈ రాము ఇతర అధికారులు పాల్గొన్నారు.



సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్

వరద బాధితులకు విట్స్ రూ.5.50 లక్షల విరాళం

అమలాపురం పట్టణం, న్యూస్‌టుడే: విజయవాడ వరద బాధితులకు అమలాపురం విట్స్ యాజమాన్యం, విద్యార్థులు రూ.5.50 లక్షలు అందజేశారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు చెక్కు అందజేసినట్లు ఆ సంస్థ ఛైర్మన్ ఆకుల నాయుడు తెలిపారు.


సీఎం చంద్రబాబుకు చెక్కును అందిస్తున్న ఆకుల నాయుడు

మేమున్నాం.. మీకు తోడుగా

సమయం: ఉ॥ 10 గం॥ నుంచి మ॥ ఒంటి గంట మధ్య

అమలాపురం: 79811 19595, ముమ్మిడివరం: 80085 74166

సమస్య: అమలాపురం సూర్యనగర్‌లో మురుగుకాలువపై పిచ్చిమొక్కలు పెరిగిపోవడంతో మురుగు ముందుకు కదలడం లేదు. **-నాగేంద్ర**

సమస్య: అమలాపురం మద్దాలవారిపేట రోడ్డు మీద వ్యర్థాలు పేరుకుపోవడంతో దుర్వాసన వస్తోంది. **-రమేష్, వ్యాపారి**

సమస్య: అమలాపురం మార్కెట్‌కాలనీలో చెత్త తొలగించకపోవడంతో దోమలు పెరిగి ఇబ్బందులు పడుతున్నాం. **-స్టాలిన్**

పరిష్కారం: ఈ సమస్యలను ఆయా వార్డుల సచివాలయ కార్యదర్శుల దృష్టికి తీసుకువెళ్లగా స్పందించారు. వాటిని దగ్గరుండి సిబ్బందితో తొలగింపజేశారు.

– న్యూస్‌టుడే, అమలాపురం పట్టణం

వీధి దీపాలకు మరమ్మతులు

సమస్య: కందికుప్ప పరిధిలో కొన్ని వీధి దీపాలు వెలగడం లేదు. అధికారులు స్పందించి వీధిదీపాలకు మరమ్మతులు చేపట్టాలి. **-స్థానికులు**

పరిష్కారం: సమస్యను సర్పంచి వెంకటలక్ష్మి దృష్టికి తీసుకువెళ్లగా స్పందించారు. సిబ్బందితో వీధిదీపాలకు అవసరమైన మరమ్మతులు చేయించారు.

చెత్త తొలగించారు

సమస్య: కాట్రేనికోనలో పంచాయతీ పరిధిలో హైస్కూల్‌రోడ్డును ఆనుకుని చెత్త పేరుకుపోయింది. పంచాయతీ అధికారులు స్పందించి అవసరమైన చర్యలు చేపట్టాలి. **-గ్రామస్థులు**

పరిష్కారం: ఈ సమస్యను పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ దృష్టికి తీసుకువెళ్లగా స్పందించారు. సిబ్బందితో పరిసరాల్లో పేరుకుపోయిన చెత్తను తొలగించే పనులు చేయించారు.

–న్యూస్‌టుడే, కాట్రేనికోన

సమస్యలు ఏకరవు


వైద్యాధికారిని నిలదీస్తున్న నాగరత్నకుమారి

ఉప్పలగుప్తం, న్యూస్‌టుడే: గతంలో శిశుమరణం సంభవించినా భీమనపల్లి పీహెచ్‌సీపై ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేదని ఎంపీటీసీ-1 సభ్యురాలు దేశంశెట్టి నాగరత్నకుమారి ఆవేదన వ్యక్తం చేశారు. మూడేళ్లుగా ఎంపీటీసీ సభ్యులకు అందించిన నిధుల వివరాలు తెలియజేయాలని ఇన్‌ఛార్జి ఎంపీడీవో మూర్తి, జేఈ రాధాకృష్ణను ఆమె కోరారు. ఉప్పలగుప్తం మండల పరిషత్తు కార్యాలయంలో ఎంపీపీ డి.వీర అచ్యుత జానకి అధ్యక్షతన గురువారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. విలసవిల్లి ఎంపీటీసీ సభ్యురాలు సురేఖాదేవి గ్రామంలో విద్యుత్తు సమస్యలు, శిథిల స్థితిలో ఉన్న పాఠశాల గురించి ఆయా శాఖల అధికారులను ప్రశ్నించారు. నంగవరం సర్పంచి జున్నూరి వెంకటేశ్వరరావు గ్రామంలో వెల్‌నెస్ సెంటరు నిర్మాణం పూర్తయినా విద్యుత్తు సౌఖర్యం కల్పించడంలో వైద్యాధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. రెవెన్యూ, డ్రెయిన్స్, ఇరిగేషన్, వెలుగు తదితర ప్రధాన శాఖల అధికారులు సభకు హాజరుకాక పోవడంతో సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. జడ్పీటీసీ సభ్యుడు గెద్దం సంపదరావు, ఈవోపీఆర్డీ గౌరికుమారి, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థుల సందడి


ఆకట్టుకున్న వేషధారణలు

అమలాపురం గ్రామీణం: కామనగరువు ఆదిత్య పాఠశాలలో గురువారం దసరా ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాల్లో సందడి చేశారు. వివిధ వేషధారణల్లో ఆకట్టుకున్నారు.

5న ప్రజాసమస్యల పరిష్కారవేదిక

ఉప్పలగుప్తం: ఉప్పలగుప్తం మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రజాసమస్యల పరిష్కార వేదిక నిర్వహిస్తామని ఇన్‌ఛార్జి ఎంపీడీవో మూర్తి తెలిపారు. ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు, మండలస్థాయి అధికారులు పాల్గొంటారన్నారు.

వస్త్రాలు అందజేత

అల్లవరం: కోడూరుపాడు పంచాయతీ పరిధిలో నివశిస్తున్న ఆకుల శ్రీనివాసరావు కుటుంబం ఆర్థిక సమస్యలతో ఇబ్బంది పడుతుందని తెలుసుకున్న జనసేన నాయకులు గురువారం నిత్యావసరాలు, నూతన వస్త్రాలు, ఆర్థిక సాయం అందించారు. భవిష్యత్తులో అన్ని విధాలా శ్రీనివాసరావు కుటుంబానికి సహాయ సహకారాలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో కల్వకొలను తాతాజీ, పిల్లా ప్రసాద్, నాయుడు, వీరబాబు, వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్‌పాస్ కౌంటర్ సేవలు నిలిపివేత

అమలాపురం గ్రామీణం: అమలాపురం ఆర్టీసీ బస్టాండ్‌లోని పాస్ కౌంటర్ సేవలను ఈ నెల 5, 6 తేదీల్లో నిలిపివేస్తున్నట్లు డిపో మేనేజర్ సీహెచ్.ఎస్.ఎన్.మూర్తి ఓ ప్రకటనలో తెలిపారు. బస్‌పాస్‌లు జారీ చేసే వెబ్‌సైట్‌లో సాఫ్ట్‌వేర్ ఆధునికీకరణ చేస్తున్న నేపథ్యంలో సేవలకు అంతరాయం కలుగుతుందన్నారు. ఈ నెల 7 నుంచి కౌంటర్‌ను పునరుద్ధరిస్తామన్నారు.

సేవలతోనే గుర్తింపు

ముమ్మిడివరం, న్యూస్‌టుడే: జిల్లా సర్వే భూ రికార్డులు కార్యాలయంలో పనిచేస్తూ బదిలీపై వెళ్తున్న ఉద్యోగులకు గురువారం సన్మానం చేశారు. అమలాపురం డివిజన్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే జి.మల్లికార్జునరావు, సర్వేయర్లు జేకేడీ ప్రసాద్, ఎండీ సుల్తాన్‌ఖాన్, ఎ.సందీప్, టి.కొండలరావు, వి.భవనేశ్వరి, శ్రీనివాసరావు, వేణుగోపాలరావులు బదిలీపై వెళ్తున్న సందర్భంగా జిల్లా సర్వే కార్యాలయంలో సన్మానం చేశారు. ముఖ్య అతిథి జిల్లా సర్వే అధికారి కె.ప్రభాకర్ మాట్లాడుతూ విధి నిర్వహణలో ప్రజలకు అందించే సేవలే గుర్తింపునిస్తాయన్నారు. ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే ఎన్.శ్రీనివాస్, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే యామిని, సర్వే ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు దాసరి సాయిబాబు, సురేష్, రవిశంకర్, కృష్ణవేణి, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఆనందం కనిపించెన్


రాజారావుకు నగదు అందిస్తున్న ప్రదీప్, సాయి

సుమారు 150 కిమీలు ప్రయాణించి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వృద్ధుడికి పింఛను అందించి సచివాలయ ఉద్యోగులు మానవత్వం చాటారు. ఉప్పలగుప్తం మండలం కిత్తనచెరువు పంచాయతీ పరిధి పాతాళదిబ్బ ప్రాంతానికి చెందిన సాకా రాజారావు, కిడ్నీ సంబంధిత వ్యాధితో శస్త్ర చికిత్స నిమిత్తం పిఠాపురంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేరారు. కూనవరం సచివాలయ ఉద్యోగులు అక్కల ప్రదీప్, ఆకుల సాయిగణేష్ ద్విచక్రవాహనంపై గురువారం పిఠాపురం వెళ్లి ఆయనకు పింఛను నగదు అందించారు. సర్పంచి ఈశ్వరి, గ్రామస్థులు ఇద్దరినీ అభినందించారు.

– న్యూస్‌టుడే, ఉప్పలగుప్తం

ఆర్‌పీఐ వ్యవస్థాపక దినోత్సవం

ముమ్మిడివరం: ముమ్మిడివరంలోని జైబుద్ధా పార్కు వద్ద భారత రిపబ్లికన్ పార్టీ వ్యవస్థాపక దినోత్సవాన్ని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు గిడ్డి జ్ఞానప్రకాష్ అధ్యక్షతన గురువారం నిర్వహించారు. ఆర్‌పీఐ నియోజకవర్గ కన్వీనర్ పంతగడ నరసింహమూర్తి పార్టీ పతాకాన్ని ఆవిష్కరించగా.. అంబేడ్కర్ విగ్రహానికి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్ఎం ఋషి పూలమాలలు వేశారు. ఉండి ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజుపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని.. ఎస్సీ వర్గీకరణను వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. దడాల రామకృష్ణ, సీహెచ్ శ్రీనివాస్, చిరంజీవి, వెంకటేశ్వరరావు, బడుగు సత్యనారాయణ, మోకా సత్తిబాబు, యలమించిలి సురేష్, అబ్బులు తదితరులు పాల్గొన్నారు.

రూ.54.74 కోట్ల ఓఎన్‌జీసీ పరిహారం జమ

యానాం: సముద్రంలో చమురు సంస్థల కార్యకలాపాల వల్ల యానాంలో జీవనోపాధి కోల్పోతున్న మత్స్యకారులకు ఓఎన్‌జీసీ సంస్థ పరిహారం విడుదల చేసిందని పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు తెలిపారు. రూ.54.74 కోట్లు ప్రభుత్వ ఖాతాలో గురువారం జమ అయినట్లు ఆయన చెప్పారు. వచ్చే వారం ప్రభుత్వపరంగా అనుమతులు తీసుకుని మత్స్యకారుల వ్యక్తిగత ఖాతాల్లో జమ చేసేలా చర్యలు తీసుకుంటానని కృష్ణారావు తెలిపారు.

కోడిపందేల స్థావరంపై దాడి

ఉప్పలగుప్తం: వానపల్లిపాలెంలో కోడిపందేలు నిర్వహిస్తున్న ఆరుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు ఉప్పలగుప్తం ఎస్సై చలమల రాజేష్ గురువారం తెలిపారు. రెండు పుంజులను, రూ.2,350 నగదు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

మద్యం విక్రేతపై కేసు

కాట్రేనికోన, న్యూస్‌టుడే: కొత్తపాలెంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న మల్లాడి వెంకటేశ్వర్లును గురువారం అదుపులోకి తీసుకున్నామని ఎస్సై అవినాష్ తెలిపారు. అతని నుంచి రూ.5,900 విలువచేసే 20 మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని అరెస్టు చేశామని ఎస్సై తెలిపారు.

కాట్రేనికోన: బలుసుతిప్పలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్నారన్న సమాచారంతో తమ సిబ్బందితో కలిసి దాడి చేసి గ్రామానికి చెందిన సంగాని వీరబాబును అదుపులోకి తీసుకున్నామని ఎస్సై అవినాష్ తెలిపారు. అతని నుంచి రూ.12,500 విలువచేసే 173 యానాం మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని అతడిని అరెస్టు చేశామని ఎస్సై తెలిపారు.

హడావుడి చేసి.. అర్ధాంతరంగా వదిలేసి..

పూర్తికాని వైకాపా హయాంలో మంజూరు చేసిన భవనాలు

న్యూస్‌టుడే, ఉప్పలగుప్తం, కాట్రేనికోన

గ్రామాల్లో వైద్యసేవలు అందుబాటులోకి తెస్తామని గత ప్రభుత్వం హడావుడి చేసింది. ప్రతి సచివాలయం పరిధిలో విలేజ్ హెల్త్ క్లినిక్‌ల నిర్మాణం చేపట్టింది. వీటికి నిధులు మంజూరులో జాప్యం చేయడంతో ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి. సిబ్బంది వైద్యసేవలు అందించేందుకు అష్టకష్టాలు పడాల్సిన పరిస్థితి ఏర్పడింది. నిర్మాణాలు పూర్తికాకుండానే సిబ్బందికి వైద్యసామగ్రి అందించడంతో వాటిని భద్రపరచడం సవాలుగా మారింది. కూటమి ప్రభుత్వం వీటిపై దృష్టిసారించి ప్రజలకు ఆరోగ్యసేవలు అందుబాటులోకి తేవాలని పలువురు కోరుతున్నారు.


ఉప్పలగుప్తంలో ఆగిన వెల్‌నెస్ సెంటరు భవన నిర్మాణం

ఉప్పలగుప్తం మండలంలో..

మండలంలోని నంగవరం, భీమనపల్లి-2 గ్రామాల్లో మాత్రమే వెల్‌నెస్ సెంటర్లు ప్రారంభించారు. మేజరు పంచాయతీ చల్లపల్లిలో మూడు సచివాలయాల పరిధిలో ఒక్క ఆరోగ్యం కేంద్రమూ నిర్మాణం పూర్తికాకపోవడం గమనార్హం. పంచాయతీ పరిధిలోని వాసాలతిప్పలో స్లాబు దశలో భవన నిర్మాణం ఆగిపోయింది. మిగిలిన రెండు చోట్ల పనులు చేపట్టలేదు. గోపవరంలో పునాదులు స్థాయిలో పనులు నిలిచిపోయాయి. కూనవరంలో స్లాబ్ దశలో పనులు జరుగుతున్నాయి. గొల్లవిల్లిలో భవనం స్లాబుదశకు చేరుకుని పనులు జరుతున్నాయి. ఉప్పలగుప్తం-1 పీహెచ్‌సీ కేంద్రం అందుబాటులో ఉంది. ఉప్పలగుప్తం -2లో వెల్‌నెస్ సెంటరు భవనం స్లాబు వేసి, గదులు నిర్మాణం పూర్తయింది. వానపల్లిపాలెంలో స్లాబ్ వేసి నిర్మాణం నిలిపివేశారు. ఎన్.కొత్తపల్లిలో రెండు సచివాలయాల్లో ఒకచోట పాతభవనం ఉండగా మరోచోట స్లాబు, గదులు నిర్మించారు. ఉప్పలగుప్తం-2 భవన నిర్మాణం స్లాబ్ దశకు చేరుకుని కొన్ని గదులు నిర్మించారు. విలసవిల్లిలో భవన నిర్మాణం దాదాపు పూర్తికావొచ్చింది.

కాట్రేనికోన మండలంలో..

మొల్లేటిమొగ, కాట్రేనికోన-2, కొత్తపాలె వంటి అయిదారు చోట్ల మినహా ఇంకెక్కడా పూర్తికాలేదు. కాట్రేనికోనలో గచ్చకాయలపోర, వేట్లపాలెంలో నిర్మాణాలకు స్లాబ్ వేశారు. మిగిలిన పనులు చేపట్టాల్సి ఉంది. కొప్పిగుంట, దొంతికుర్రులో నిర్మాణాలు పునాది దశను దాటలేదు. గ్రామ సచివాలయ భవనాల్లో కార్యాకలాపాలు నిర్వహిస్తున్నారు. కందికుప్పలోని బొజ్జావారిపేటలోను పునాది దశ దాటకపోవడంతో తుపాను రక్షిత భవనంలో కార్యాకలాపాలు సాగిస్తున్నారు.


కందికుప్పలో నిర్మాణంలో నిలిచిన భవనం

పనులు పూర్తిచేస్తాం

ఆగిన వెల్‌నెస్ సెంటరు భవనాలను పూర్తి చేయిస్తాం. పునాదుల స్థాయిలో ఉన్న వాటిని ఆ గ్రామాల పరిధిలోని పీహెచ్‌సీలకు అప్పగించాం. ప్రస్తుతం గ్రామాల్లో కొన్ని చోట్ల నిర్మాణాలు జరుగుతున్నాయి.

-రాధాకృష్ణ, ఏఈ, ఉప్పలగుప్తం మండలం

చర్యలు తీసుకుంటాం

బిల్లులు రాకపోవడంతో కొన్నిచోట్ల నిర్మాణాలు మధ్యలో నిలిచాయి. నిధులు వచ్చిన వెంటనే గుత్తేదారులతో మాట్లాడి ఉన్నతాధికారుల సూచనల మేరకు చర్యలు తీసుకుంటాం. **-సయ్యిద్ ఫకీర్, జేఈ, కాట్రేనికోన**

విద్యుత్తు సరఫరాకు అంతరాయం

అల్లవరం: దేవగుప్తం విద్యుత్తు ఉప కేంద్రం పరిధిలో శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్తు సరఫరా నిలుపుదల చేయనున్నట్లు ఈఈ రవికుమార్ గురువారం తెలిపారు. నల్లగుంట నుంచి ఎంట్రుకోన వరకు సీసీ రహదారి పనులు నిమిత్తం విద్యుత్తు స్తంభాలను మార్పు చేస్తున్న కారణంగా విద్యుత్తు అంతరాయం కలగనున్నట్లు ఆయన తెలిపారు.

శాంతిస్థాపనకు కృషి చేయాలి

కాట్రేనికోన: సమాజంలో ప్రజలంతా ఒకరికొకరు సహాయంగా ఉన్నప్పుడే మానవ సంబంధాలు మెరుగుపడతాయని పాస్టర్ తాతపూడి ఎర్నెస్ట్ అన్నారు. చర్చ్ ఆఫ్ ది లివింగ్ గాడ్ మినిస్ట్రీస్ పాస్టర్ ఎన్.జోషఫ్‌రాజు ఆధ్వర్యంలో గురువారం రామస్వామితోటలో దైవ సేవకుల సదస్సు నిర్వహించారు. ప్రజలంతా శాంతిస్థాపనలో భాగమయ్యేలా పాస్టర్లు కృషి చేయాలన్నారు. డేవిడ్ తంబి, జి. శ్యామ్‌సన్, దానియేలురాజు, యు.జాన్సన్, కాంతారావు, తదితరులు పాల్గొన్నారు.

స్నేహితుడి కుటుంబానికి ఆర్థిక సాయం

ఐ.పోలవరం: అన్నంపల్లిలో విద్యుదాఘాతానికి గురై మృతి చెందిన మోర్త సాయి కుటుంబానికి అతని స్నేహితులు ఆర్థికసాయం అందజేశారు. మురమళ్ల జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల్లో 1996లో పదో తరగతి చదివిన తోటి విద్యార్థులు రూ.35,600 సేకరించి మృతుని కుటుంబానికి గురువారం అందించారు.

నెయ్యి కల్తీ నిందితులను శిక్షించాలి

అమలాపురం పట్టణం: పవిత్రమైన తిరుమల లడ్డూలో నెయ్యిని కల్తీ చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని జనసేన జిల్లా సంయుక్త కార్యదర్శి చిక్కం బీముడు పేర్కొన్నారు. అమలాపురంలోని గడియారస్తంభం ప్రాంగణంలో జనసేన పార్టీ నాయకులు గురువారం భజన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో గండి మణి, చెరుకూరి శ్రీను, వంటెద్దు సత్తిబాబు, కంకిపాటి సుబ్బన్న, గనిశెట్టి శ్రీను, పల్లంరాజు తదితరులు పాల్గొన్నారు.

మండపేట

•మండపేట •రామచంద్రపురం

భీమేశ్వరాలయంలో ప్రసాద వితరణ

ద్రాక్షారామ, న్యూస్‌టుడే: శరన్నవరాత్రి వేడుకల్లో భాగంగా ద్రాక్షారామ శ్రీమాణిక్యాంబ సమేత భీమేశ్వరాలయంలో దాత సహకారంతో ఉచిత ప్రసాద వితరణ ప్రారంభించారు. తోటపేట శ్రీవెంకటేశ్వర రైస్ ఇండస్ట్రీస్ అధినేత సత్తి సుబ్బారెడ్డి సౌజన్యంతో 12 రోజుల పాటు ఉదయం, సాయంత్రం ఆలయానికి వచ్చే వేలాది మంది భక్తులకు ఉచితంగా ప్రసాద వితరణ చేయనున్నారు. ఈకార్యక్రమాన్ని గురువారం ఉదయం పి.కృష్ణ లాంఛనంగా ప్రారంభించారు. తొలిరోజు ఉదయం పులిహోర, సాయంత్రం శనగలు పంపిణీ చేశారు. ఆలయ ఈవో దుర్గాభవాని, దాత సత్తి సుబ్బారెడ్డి, కుమారులు దినబాబు, గోపాలరెడ్డి పాల్గొన్నారు.

ముగిసిన గ్రామ సభలు

ద్రాక్షారామ, న్యూస్‌టుడే: హసనబాద, నెలపర్తిపాడు గ్రామాల్లో గురువారం స్వచ్ఛత గ్రామ సభలను నిర్వహించారు. ఈ సందర్భంగా హసనబాద గ్రామంలో సర్పంచి నాగిరెడ్డి సతీష్‌రావు అధ్యక్షతన జరిగిన గ్రామ సభకు తెదేపా నాయకుడు చింతపల్లి అర్జున్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. గ్రామాల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులు, జరిగిన అభివృద్ధి పనులను సర్పంచి ప్రజలకు వివరించారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాల్లో సేవలందించిన సిబ్బందికి బహుమతులు అందజేశారు. అనంతరం గ్రామంలో నీడనిచ్చేందుకు గానుగ మొక్కలను నాటారు. మొక్కలను ప్రతి ఒక్కరూ సంరక్షించుకోవాలని కోరారు. కార్యక్రమంలో కార్యదర్శి భాస్కరలక్ష్మి, వార్డు సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

మురుగుతో ఇక్కట్లే..



సమస్య: రామచంద్రపురం పట్టణం 25వ వార్డు నాయుడు వారి వీధిలో నిత్యం మురుగు కాలువలో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. వర్షం వస్తే రోడ్డంతా మురుగునీటితో ముంపునకు గురవుతుంది. వర్షం లేకపోయినా, ఎండ వచ్చినా మురుగు ముందుకు పారడం లేదు. అధికారులు తగిన చర్యలు చేపట్టాలని వేడుకుంటున్నాం.

- సీహెచ్.సతీష్, నాయుడువారి వీధి, రామచంద్రపురం

సమాధానం: పట్టణ 25 వార్డు నాయుడు వారి వీధిలో మురుగు కాలువల్లో సిల్టు తీయిస్తాం. ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూస్తాం. సంబంధిత సిబ్బందికి ఆదేశిస్తూ వెంటనే సమస్యకు పరిష్కారం చూపిస్తాం.

-డేవిడ్‌రాజు, శానిటరీ తనిఖీదారు, రామచంద్రపురం.

–న్యూస్‌టుడే, రామచంద్రపురం

సమయం : ఉ॥ 10 గం॥ నుంచి మ॥ ఒంటి గంట మధ్య	మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు:
	మండపేట : 80085 74183
	రామచంద్రపురం: 80085 74191



రామచంద్రపురం కొత్తూరు రోడ్డులో..



ప్రధాన రోడ్డులో..



మండపేటలో..



ఆదివారపుపేటలో..



కోరుమిల్లిలో..



వెదురుపాకలో..



పామర్రులో ఆకట్టుకుంటున్న విద్యుద్దీపాలంకరణ

బాలాత్రిపుర సుందరీదేవి మము దీవించు

రామచంద్రపురం: రామచంద్రపురం పట్టణంలో శరన్నవరాత్ర మహోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. మొదటి రోజు శ్రీబాలాత్రిపుర సుందరీదేవిగా అమ్మవార్లను అలంకరించారు. కొత్తూరు రోడ్డులో కనకదుర్గమ్మ అమ్మవారు, పార్కువద్ద కనకదుర్గమ్మ, ప్రధాన రోడ్డులో జ్ఞాన సరస్వతి, శీలంవారి సావరం రోడ్డులో అమ్మవారిని అలంకరించారు. పార్కువద్ద కనకదుర్గమ్మ అమ్మవారిని గ్రామోత్సవం నిర్వహించారు.

ద్రాక్షారామ: ద్రాక్షారామ మాణిక్యాంబ అమ్మవారి ఆలయంలో కలశస్థాపన మండపంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన అమ్మవారి విగ్రహాన్ని బాలాత్రిపుర సుందరి అవతారంలో అలంకరించారు. వెలంపాలెం గోగులంబ ఆలయంలో, ద్రాక్షారామ శ్రీ కన్యకా పరమేశ్వరి ఆలయం, సత్యనారాయణ స్వామి వారి ఆలయాల్లో, వెల్ల బాలా త్రిపుర సుందరీ సమేత వేణుగోపాల స్వామి వారి ఆలయంలో, ఆదివారపుపేట బాలయోగి ఆశ్రమంలో అమ్మవారిని బాలా త్రిపురసుందరి రూపంలో అలంకరించారు.

మండపేట గ్రామీణం: బాలా త్రిపురసుందరి అమ్మవారిగా వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారు దర్శనమిచ్చారు. రైతుబజారువద్ద ఉన్న విజయదుర్గాదేవి ఆలయంలో వివిధ పుష్పాలతో పుష్పార్చన జరిగింది. సత్యశ్రీ థియేటర్ వద్ద వేంచేసియున్న కనకదుర్గమ్మవారికి విశేషపూజలు జరిగాయి. తహసీల్దార్ కార్యాలయ సమీపంలోని కనకదుర్గమ్మ, కలవపువ్వ సెంటర్‌లోని దుర్గమ్మ వారి ఆలయంలో కుంకుమార్చనలు జరిగాయి.

అంగర: అంగర, కాలేరు, టేకి, కపిలేశ్వరపురం, వల్లూరు, కోరుమిల్లి, మాచర తదితర గ్రామాల్లో గురువారం దసరా శరన్నవరాత్రి వేడుకలు వైభవంగా ప్రారంభమయ్యాయి.

రాయవరం: వెదురుపాక విజయదుర్గా పీఠంలో తొలిరోజు అమ్మవారిని బాలా త్రిపుర సుందరిగా అలంకరించారు. కలశస్థాపన చేసి ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు.

పామర్రు: ప్రముఖ శైవక్షేత్రం కోటిపల్లి రాజరాజేశ్వరి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. పామర్రులో కాపుల కాలనీ, శెట్టిబలిజపేట కాలనీల్లో పెద్ద పెద్ద సెట్టింగులతో విద్యుద్దీపాలంకరణలు చేశారు. పామర్రు శివాలయంలోని పార్వతీ దేవి వద్ద గ్రామంలోని పలువురు మహిళలు సామూహికంగా లలితా సహస్రనామ పారాయణ చేశారు. సత్యవాడ, దంగేరు,. కె.గంగవరం తదితర గ్రామాల్లో కూడా దుర్గాదేవి నవరాత్రులను ఘనంగా చేస్తున్నారు. కుందూరు దుర్గాదేవిని భవాని దీక్ష ధరించిన కార్మిక శాఖ మంత్రి సుభాష్ దర్శించుకుని పూజలు చేశారు.


తెదేపాలో చేరిన కౌన్సిలర్

మండపేట గ్రామీణం, న్యూస్‌టుడే: మండపేట మున్సిపాలిటీలోని 26వ వార్డు కౌన్సిలర్ అమలదాసు లక్ష్మి, ఆమె భర్త రుద్రమూర్తి వైకాపాను వీడి తెదేపాలోకి చేరారు. గురువారం తెదేపా కార్యాలయంలో ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు సమక్షంలో అనుచరులతో చేరడంతో వారికి తెదేపా కండువా కప్పి పార్టీలో ఎమ్మెల్యే ఆహ్వానించారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై తాము పార్టీలోకి జాయిన్ అయినట్లు లక్ష్మి తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ ఛైర్మన్ చుండ్రు శ్రీవరప్రకాష్, పట్టణ తెదేపా అధ్యక్షుడు ఉంగరాల రాంబాబు, మున్సిపల్ వైస్ ఛైర్మన్ పిల్లి గణేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

తప్పిన రిజిస్ట్రేషన్ల పాట్లు

"కె.గంగవరం మండలం అముజూరు, పామర్రు, కె.గంగవరం, దంగేరు తదితర గ్రామ సచివాలయాల్లో ప్రజలు వారి ఆస్తులకు సంబంధించిన రిజిస్ట్రేషన్ల ప్రక్రియ చేసుకోవచ్చని అధికారులు ప్రకటించారు. సిబ్బందికి ప్రత్యేక శిక్షణ ఇచ్చామన్నారు. అయితే ఈ గ్రామాల్లో రిజిస్ట్రేషన్ల ప్రక్రియ ముందుకు సాగలేదు. కొందరు రిజిస్ట్రేషన్ చేయించుకోవడానికి సచివాలయానికి వచ్చి అక్కడ పని జరగకపోవడంతో సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయానికి వెళ్లిపోయారు."

– న్యూస్‌టుడే, పామర్రు



పామర్రు సచివాలయం

వైకాపా ప్రభుత్వం ఆర్భాటంగా సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ ప్రక్రియ చేపట్టింది కానీ వసతులు, వనరులు సమకూర్చడం మరిచిపోయింది. దాంతో రామచంద్రపురం, మండపేట నియోజకవర్గాల్లో ఎక్కడా కూడా ఈ విధానం అమల్లోకి రాలేదు. ఇప్పటికే పలు పనులతో సతమతం అవుతున్న తమకు మళ్లీ ఈ విధానం తలనొప్పి తెస్తోందని సచివాలయాల కార్యదర్శులు వాపోయేవారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం వచ్చి అస్తవ్యస్తంగా ఉన్న ఈ విధానాన్ని తొలగించింది. దీంతో గ్రామ సచివాలయాల కార్యదర్శులు, సిబ్బంది ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

గొప్పలు చెప్పారు..చతికిల పడ్డారు..

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అవినీతి నిరోధించడానికి, రిజిస్ట్రేషన్లలో జాప్యాన్ని నివారించడానికి గ్రామ, వార్డు, సచివాయాల్లోనే సేవలు ప్రారంభిస్తామని వైకాపా ప్రభుత్వం గొప్పగా అప్పట్లో ప్రకటించింది. వీటిలో పారదర్శకంగా ప్రజలకు సేవలు అందుతాయని, ఎవరికీ లంచాలివ్వకుండానే తక్కువ సమయంలోనే పనులు జరుగుతాయని పేర్కొంది. ప్రజలు ఈ కార్యక్రమం ఎపుడు ప్రారంభం అవుతుందా అని ఎదురు చూడడమే తప్ప ఆచరణలోకి మాత్రం రాలేదు. రెండు నియోజకవర్గాల పరిధిలో 13 గ్రామ పంచాయతీల్లో ఈ కార్యక్రమం ప్రారంభించినా అన్ని చోట్లా కలిపి కేవలం ఐదు మాత్రమే రిజిస్ట్రేషన్లు అయినట్లు అధికారులు చెప్పారు.

ఆనందంగా ఉంది..

సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ ప్రక్రియను తొలగించడం పట్ల సచివాలయ కార్యదర్శులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఉదయం నుంచి రాత్రి వరకూ ఊపిరి సలపకుండా పనులుంటున్నాయని ఈ దశలో ఇది చేయడానికి వీలుండేదే కాదని కె.గంగవరం గ్రామ కార్యదర్శి ఎం.వి.వి.సత్యనారాయణ(చంటి) చెప్పారు. కొనసాగించడానికి ఇచ్చిన శిక్షణ సరిపోకపోవడం, సాంకేతిక పరంగా తగిన ఏర్పాట్లు లేకపోవడం, తగిన సామగ్రి రాకపోవడం, ప్రింటర్లు, వెబ్ కెమెరాలు సిద్ధం చేయకపోవడం, ఇలా పలు అవాంతరాలతో సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ల ప్రక్రియ అందుబాటులోకి రాలేదని ఆయన అన్నారు. ఉన్న వనరులతోనే ఏదో చేసేవారం తప్ప కుదిరేదే కాదని పామర్రు కార్యదర్శి ఎం.సీతారామయ్య తెలిపారు. మొత్తం మీద కూటమి ప్రభుత్వం తమకు గొప్ప కానుక ఇచ్చినట్లుగా భావిస్తున్నామని సచివాలయ కార్యదర్శులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

రథంగుడి అభివృద్ధికి రూ.కోటి మంజూరు

మండపేట గ్రామీణం, న్యూస్‌టుడే: మండపేటలో ప్రసిద్ధి చెందిన జనార్ధన, అగస్త్యేశ్వరస్వామి ఆలయం (రథంగుడి) అభివృద్ధికి రూ.కోటి మంజూరైనట్లు ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు తెలిపారు. ఆలయాన్ని సుందరంగా తీర్చిదిద్దేందుకు, పలు ఆధునికీకరణ పనులకు ఈ నిధులు వెచ్చిస్తామన్నారు. శరన్నవరాత్రి ఉత్సవాల ప్రారంభ పూజను ఎమ్మెల్యే వేగుళ్లజోగేశ్వరరావు నిర్వహించారు. అభిషేకాన్ని నిర్వహించారు. అర్చకులు అయినివిల్లి సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో కలశస్థాపన, అభిషేకాలు, కుంకుమార్చన నిర్వహించారు. ఆలయ ఈవో కామేశ్వరరావు, అన్నవరం దేవస్థానం పాలకమండలి మాజీ సభ్యులు అవసరాల వీర్రాజు,. భక్తులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.



అమ్మవారి పూజా కార్యక్రమంలో ఎమ్మెల్యే

గ్యాస్ పంపిణీ పాయింట్‌కు వినతి

ద్రాక్షారామ, న్యూస్‌టుడే : ద్రాక్షారామకు చెందిన హెచ్‌పీ వంటగ్యాస్ వినియోగదారులకు సకాలంలో గ్యాస్ సిలిండర్లు పంపిణీ అవ్వక ఇబ్బందులు పడుతున్నారని మైనార్టీ బీసీ సంఘం అధ్యక్షుడు యాట్ల నాగేశ్వరరావు పేర్కొన్నారు. ద్రాక్షారామ పరిసర ప్రాంతాల్లో నివశించే వారికి దాదాపు ఏడుకిలోమీటర్ల దూరంలో ఉన్న రామచంద్రపురం పట్టణం నుంచి డెలివరీ చేయాల్సి వస్తుందని, కాబట్టి ద్రాక్షారామలో ఒక డెలివరీ పాయింట్ ఏర్పాటు చేస్తే ఇబ్బంది లేకుండా ఉంటుందని ఆయన పేర్కొన్నారు.

అధ్వాన దారిలో అవస్థల ప్రయాణం

మండపేట (ద్వారపూడి), న్యూస్‌టుడే: మండపేట పట్టణం పెదకాలువ నుంచి కలువపువ్వ వెళ్లే రహదారి అధ్వానంగా మారింది. దీంతో వాహనచోదకులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగించడం వల్ల పది అడుగులకు ఒక గుంత ఏర్పడి రాళ్లు పైకిలేచి రహదారి ఛిద్రమైంది. పెదకాలువ నుంచి అటు రాజమహేంద్రవరం, కాకినాడ ఇటు రావుల పాలెం వెళ్లడానికి ప్రధాన మార్గం కావడంతో నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగుతుంటాయి. భారీ గుంతలు ఏర్పడటంతో వర్షం వచ్చినప్పుడు నీరు నిలిచిపోయి వాటిని తప్పించే క్రమంలో వాహనదారులు కిందపడి గాయాలపాలవుతున్నారు. కనీసం గుంతలు పూడ్చేందుకు సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవడంలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే రహదారి నిర్మించాలని వాహనచోదకులు, స్థానికులు కోరుతున్నారు. దీనిపై ర.భ.శాఖ డీఈ ఎస్‌వి.సూర్యనారాయణను వివరణ కోరగా పట్టణంలో పెదకాలువ నుంచి అయ్యప్పస్వామి గుడి దగ్గర పాత టోల్‌గేట్ వరకు సీసీ రహదారి నిర్మాణానికి ప్రతిపాదనలు పంపించామన్నారు. నిధులు మంజూరైన వెంటనే రహదారి నిర్మాణం మొదలుపెడతామన్నారు.



సినిమా రోడ్డు దుస్థితి

ప్రకృతి వ్యవసాయంపై రైతులు దృష్టి సారించండి

రాయవరం, న్యూస్‌టుడే: రైతులందరూ ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించడం ద్వారా ఆరోగ్యకరమైన పంటలను పండించే అవకాశం ఉంటుందని మండల వ్యవసాయాధికారి కె.ప్రభాకర్ సూచించారు. గురువారం ఆయన మండలంలోని చెల్లూరు, వెంటూరు గ్రామాల్లో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ ఏడాది పశుగణన చేపట్టడం జరుగుతుందని పాడి రైతులందరూ అధికారులకు పశువుల గురించి సమాచారం ఇవ్వాలని పశుసంవర్ధకశాఖ అధికారి విజయ్ విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు వాసంశెట్టి విజయ్‌కుమార్, చిరట్ల అప్పారావు, దేవళ్ల వెంకట్రావు, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ద్రాక్షారామ: రామచంద్రపురం మండలం చోడవరం గ్రామంలో గురువారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా సర్పంచి నేదూరి సంతోషమ్మ, ఏడీఏ ఏవీ రంగారావు హాజరయ్యారు. ఏడీఏ పంటలో వచ్చే తెగుళ్ల గురించి వివరించారు. పశువైద్యాధికారి విజయదుర్గ మాట్లాడుతూ పాడిరైతులు పశువుల షెడ్లు నిర్మించుకొనేందుకు రాయితీ అందిస్తుందని తెలిపారు.



వెంటూరులో వ్యవసాయ క్షేత్రాన్ని సందర్శిస్తున్న అధికారులు, రైతులు

విజయదుర్గ అమ్మవారికి వెండి కిరీటం సమర్పణ

అంగర, న్యూస్‌టుడే: కపిలేశ్వరపురం స్థానిక సాలిపేట వద్ద పెద్దకాలువ గట్టున కొలువై ఉన్న విజయ దుర్గ అమ్మవారికి గురువారం దాతలు వెండి కిరీటం సమర్పించారు. గ్రామానికి చెందిన కొప్పిశెట్టి లక్ష్మణ్ కిషోర్, బిందు రాజ్యలక్ష్మి దంపతులు సుమారు కిలో బరువు గల కిరీటాన్ని ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. శరన్నవరాత్రి వేడుకల ప్రారంభోత్సవం సందర్భంగా అర్చకులు కాలధరి కార్తికేయ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరిపి, అమ్మవారికి అలంకరించారు. దీని విలువ సుమారు రూ.90,000 ఉంటుందని ఆలయకమిటీ సభ్యులు తెలిపారు.



ఆభరణంతో దాత కుటుంబ సభ్యులు

ధర్మప్రచార పాదయాత్ర

అంగర, న్యూస్‌టుడే: ప్రతి ఒక్కరూ జీవహింసను విడనాడి, సంపూర్ణ శాకాహారులుగా మారాలని విశాఖపట్టణం ప్రకృతి వ్యాలీ అధినేత దాట్ల రాయి జగపతిరాజు అన్నారు. మహాకరుణయాగంలో భాగంగా కపిలేశ్వరపురం మండలం టేకిలో నిర్వహించిన ధర్మప్రచార పాదయాత్ర కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి ధ్యానం చేసే పద్ధతులు, శాకాహార ప్రాముఖ్యత తెలిపేలా ముద్రించిన కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం 1200 గ్రామాల్లో 92 రోజుల పాటు కొనసాగుతుందని చెప్పారు. కార్యక్రమంలో స్థానిక పిరమిడ్ మాస్టర్లు, ధ్యానమిత్రులు పాల్గొన్నారు.



టేకిలో పాదయాత్ర చేస్తున్న ధ్యానమిత్రులు

జనసైనికుల పూజలు

అంగర, న్యూస్‌టుడే: తిరుమల వేంకటేశ్వరస్వామి లడ్డూ ప్రసాదంపై వివాదాల నేపథ్యంలో ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ చేపట్టిన ప్రాయశ్చిత్త దీక్ష విజయవంతంగా పూర్తయిన సందర్భంగా కపిలేశ్వరపురం మండలం కేదార్లంకలో జనసైనికులు పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు చేపట్టారు. స్థానిక రామాలయం వద్ద ప్రత్యేక పూజలు జరిపి, దీపారాధన, భజన కార్యక్రమాలు నిర్వహించారు. కూటమి నాయకులు రంకిరెడ్డి వెంకటేశ్వరరావు, బజన గురువు గంటా ఈశ్వరరావు, సాదా ధనరాజు, దూలం శ్రీను, యర్రంశెట్టి సత్యనారాయణ, వానపల్లి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఘనంగా అమ్మవారి ఆయుధాల ఊరేగింపు

రామచంద్రపురం, న్యూస్‌టుడే: ప్రతి ఏటాలానే కొత్తూరు రోడ్డు అమ్మవారి ఆభరణాలను ఆయుధ పూజ కోసం ముచ్చుమిల్లి రోడ్డులో ఉన్న పెద్ద వంతెన కాలువ వద్దకు భక్తులు ఎంతో ఉత్సాహంగా ఉత్సవంగా తీసుకెళ్లారు. పండితులు చెరుకుపల్లి గణేశ్ శర్మ బ్రహ్మత్వంలో ఆయుధ పూజలు ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు మున్సిపల్ మాజీ వైస్ ఛైర్మన్ కట్టా నాగేశ్వరరావు, మాజీ కౌన్సిలర్ దంగేటి గౌరీశంకర్, అనుసూరి బ్రహ్మారావు, దంగేటి శివకుమార్, పోలవరపు దుర్గా ప్రసాద్, వాసంశెట్టి సురేష్ తదితరులు పాల్గొన్నారు.



ఆయుధాలను ఉత్సవంగా తీసుకెళ్తున్న భక్తులు

ప్రత్యేక పారిశుద్ధ్య చర్యలు

ద్వారపూడి, న్యూస్‌టుడే: మండపేట మండలం ద్వారపూడి పంచాయతీ వద్ద గాంధీ జయంతిని పురస్కరించుకుని 2న జరిగిన గ్రామసభలో తీసుకున్న నిర్ణయం మేరకు గురువారం పంచాయతీ పరిధిలో పారిశుద్ధ్య నిర్వహణపై పంచాయతీ అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. పారిశుద్ధ్య నిర్వహణ చర్యలు చేపట్టారు. బంగారమ్మ, డ్రైవర్స్ కాలనీ, ఎస్వీఆర్ వీధిలో రహదారిపై చెత్తను తొలగించి బ్లీచింగ్ చల్లారు. పంచాయతీ కార్యదర్శి ఆకుల వివి రమణ పాల్గొన్నారు.



పనులు చేస్తున్న పంచాయతీ సిబ్బంది

కార్పెంటర్ల సమస్యలపై స్పందించాలి

రామచంద్రపురం, న్యూస్‌టుడే: కార్పెంటర్ల సమస్యలపై ప్రభుత్వం స్పందించాలని రెడీమేడ్ గుమ్మాలు, కిటికీల వల్ల చేతివృత్తుల వారంతా జీవనోపాధి కోల్పోతున్నారని రామచంద్రపురం శ్రీ కామాక్షి దుర్గ కార్పెంటర్ అసోసియేషన్ సభ్యులు రామచంద్రపురం తహసీల్దారు వెంకటేశ్వరరావుకు గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు దేవాదుల సూర్యనారాయణమూర్తి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ రెవెన్యూ అధికారులు దృష్టి సారించి ప్రభుత్వం దృష్టికి తమ సమస్యలను తీసుకెళ్లాలన్నారు. ఈ కార్యక్రమంలో గానాల సాయి, రామోజు శ్రీనివాసు, అంగర జగదీష్, ధర్మాసనం రామకృష్ణ, కంబాల విజయ్‌కుమార్, పితాని బేబీరావు, గున్నేపల్లి భీమశంకరం, యార్లగడ్డ అరుణ్ కుమార్ పాల్గొన్నారు.



తహసీల్దారుకు వినతిపత్రం అందిస్తున్న కార్పెంటర్ల సంఘ సభ్యులు

బెల్లపు ఊట ధ్వంసం

మండపేట గ్రామీణం, న్యూస్‌టుడే: తాపేశ్వరం లాకులు వద్ద సారా అమ్ముతున్న వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు మండపేట రూరల్ ఎస్సై డి.సురేష్ బాబు తెలిపారు. వేములపల్లి శివారు జీడిమామిడి తోటలో 800 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసి, 5 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకొని బత్తుల నాగేశ్వరరావును, గొర్తా నూకమ్మను అరెస్ట్‌చేసి రిమాండ్‌కు పంపినట్లు ఎస్సై వెల్లడించారు. హెడ్ కానిస్టేబుల్ నారాయణ, సత్యకుమార్, చందు, లక్ష్మణ్, గంగరాజు, శ్రీనులు పాల్గొన్నారు.

ఊరికి ఉపకారి... ప్రజల మేలు కోరి

మలివయసులోనూ ప్రజోపయోగ పనుల్లో ఎన్ఆర్ఐ

న్యూస్‌టుడే, అంగర

జీవితంలో ఎంత ఎత్తుకు ఎదిగినా తనకు జన్మనిచ్చిన ఊరును ఆయన విస్మరించలేదు. గ్రామ ఉన్నతికి నిత్యం శ్రమించారు. పుట్టిన ఊరికి వేల మైళ్ల దూరంలో ఉన్నా ఇక్కడి గ్రామస్థుల కోసం పరితపించారు. అంగరకు చెందిన సుబ్బారావు విశాఖపట్టణం ఆంధ్ర మెడికల్ కళాశాలలో 1944లో ఎంబీబీఎస్ పూర్తి చేశారు. 1955లో మండపేటలో ప్రాక్టీస్ ప్రారంభించి, వైద్య సేవలందించారు. 1972లో అమెరికాకు వెళ్లి అక్కడ 30 ఏళ్ల పాటు వైద్యుడిగా పనిచేశారు. డెబ్బై నాలుగేళ్ల వయసులో రిటైర్మెంట్ తీసుకున్నారు. సొంతూరికి ఏదైనా మంచి చేయాలనే సంకల్పంతో తన తండ్రి పేరు మీద 'బలుసు రుద్రయ్య మెమోరియల్ ట్రస్ట్'ను స్థాపించి అనేక సేవాకార్యక్రమాలు చేస్తున్నారు. సుబ్బారావు భార్య వసుంధర గతేడాది కన్నుమూయడంతో ఆమె జ్ఞాపకార్థం అంగర పీహెచ్‌సీ ఆవరణలో రూ.75 లక్షలతో ప్రత్యేక బ్లాక్ నిర్మాణాన్ని చేపట్టారు. ఈ నెల 5న కార్మిక శాఖా మంత్రి వాసంశెట్టి సుభాష్, ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు భవనాన్ని ప్రారంభించనున్నారు.



అంగర పీహెచ్‌సీలో ప్రారంభానికి సిద్ధమైన భవనం

ఇవీ సామాజిక సేవా కార్యక్రమాలు

● అంగర ఉన్నత పాఠశాలలో ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు ఇవ్వడానికి రూ.2లక్షలు ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశారు. ● రూ.8లక్షలతో కళా వేదిక నిర్మిస్తున్నారు. ● కపిలేశ్వరపురం మండల కాకతీయ కమ్మ సంఘానికి రూ.20లక్షలు అందజేశారు. ఈ మొత్తంపై వచ్చే వడ్డీని నిరుపేద విద్యార్థుల చదువులకు వినియోగించాలని సూచించారు. ● కపిలేశ్వరపురం నాన్ భవిత కేంద్రంలోని ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థుల కోసం రూ.10 లక్షలు డిపాజిట్ చేశారు. ● అంగరలో బహిరంగ మలవిసర్జనను అరికట్టడానికి 600 కుటుంబాలకు రూ.3000 చొప్పున అందించి, మరుగుదొడ్ల నిర్మాణాలు పూర్తి చేయించారు. ● గ్రామంలో రూ.8లక్షలతో ఆర్వో ప్లాంటు ఏర్పాటుచేశారు. ● పంచాయతీ కార్మికులకు రూ.లక్ష ఆర్థిక సహాయం, గ్రామస్థులు తడి, పొడి చెత్తలను వేరుచేయడానికి వీలుగా రూ.4 లక్షలతో డస్ట్‌బిన్ల పంపిణీ చేపట్టారు. ● అంగర, పడమర ఖండ్రిక శ్మశానవాటిక వద్ద రూ.6 లక్షలతో అస్థికలు భద్రపరుచుకునే భవనం నిర్మించి, బాడీఫ్రీజర్ బాక్సు అందజేశారు. ప్రముఖ కార్డియాలజిస్ట్ డా.అల్లం రాజు శ్రీనివాస్‌కుమార్ ఫౌండేషన్‌కు హార్ట్ స్పెషలైజేషన్ పరిశోధనల నిమిత్తం రూ.కోటి విరాళం అందించారు. గ్రామంలోని మహిళలకు బసవతారకం కేన్సర్ ఆసుపత్రి వైద్యుల ద్వారా శిబిరాలు నిర్వహించారు.



అంగరలో నిర్మించిన ఉన్నత పాఠశాల

పరులసేవతో పునీతం



జీవితంలో స్థిరపడ్డాక మా తండ్రి రుద్రయ్య పేరు మీద సేవాకార్యక్రమాలు చేపట్టాలని అనుకున్నా. ఆ ప్రకారమే గ్రామంలో అనేక కార్యక్రమాలు చేపట్టా. భవిష్యత్తులోనూ గ్రామానికి మంచి పనులు చేయడాన్ని కొనసాగిస్తా. చిన్నప్పుడు నేను చదువుకునేటపుడు పడ్డ కష్టాన్ని విద్యార్థులెవరూ పడకూడదని పాఠశాలలో మౌలిక వసతులు కల్పిస్తున్నాం. నేనెప్పుడూ పరుల సేవతోనే సంపదకు సార్థకత చేకూరుతుందని భావిస్తా.

– డా.సుబ్బారావు బలుసు, విశ్రాంత వైద్యుడు